ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక
RNI : TELTEL/2021/80267
సంపుటి: 6 సంచిక: 100, పేజీలు - 08
శనివారం,అక్టోబర్ 10, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# తెలంగాణపై కరెంట్ షాక్!

## - రూ.5,420 కోట్ల ట్రూ-అప్ భారం - ప్రజాగ్రహాన్ని ప్రభుత్వం తప్పించుకోగలదా?




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు, విపరీతంగా పెరిగిన ఉష్ణోగ్రతలు , పారిశ్రామిక, వ్యవసాయ రంగా భూమి డిమాండ్ల కారణంగా విద్యుత్ రంగంలో తీవ్ర సవాళ్లు ఎదురవుతున్నాయి. రాష్ట్రంలో ఆల్-టైమ్ రికార్డు స్థాయిలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ ఏకంగా 19,892 మెగావాట్లను దాటడంతో విద్యుత్ పంపిణీ వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో అన్-షెడ్యూల్డ్ పవర్ కట్స్, లో-వోల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయని నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్ష బిఆర్ఎస్ దీనిని రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప పరిపాలనా వైఫల్యంగా టార్గెట్ చేస్తుండటంతో కాంగ్రెస్ సర్కార్ తీవ్ర అప్రమత్తమైంది.

### కొత్తగా ట్రూప్ అప్ చార్జీల భారం

ఒకవైపు విద్యుత్ కొరత సవాలు కాగా, మరోవైపు వినియోగదారులకు బారి బిగ్ షాక్ తగిలింది. గతంలో బిఆర్ఎస్ హయాంలో 2022-23 , 2023-24 నాటి విద్యుత్ కొనుగోళ్లు, అదనపు వ్యయాలు , ఆదాయ లోటును సర్దుబాటు చేసే నెపంతో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి డిస్కంలకు మొత్తం రూ. 7,635.22 కోట్ల ట్రూ-అప్ చార్జీల వసూలుకు అనుమతినిచ్చింది. ఇందులో వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ. 2,214.99 కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా భరించనుండగా, మిగిలిన రూ. 5,420.23 కోట్లను వ్యవసాయేతర వినియోగదారుల నుంచి వచ్చే నెల నుంచి దశలవారీగా వసూలు చేయనున్నారు. ఈ రూ. 5,000 కోట్లకు పైగా అదనపు భారం నేరుగా ప్రజలపై పడటం

2లో..

## వ్యాపారానికి కాదు, గుత్తాధిపత్యంపైనే పోరు!

### - మోదీ సర్కార్‌పై రాహుల్, ఖర్గే తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో ప్రతి వ్యాపార సంస్థకు కూడా సమానంగా అవకాశాలు ఉండాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. కేవలం రాజకీయ అండతోనే కొన్ని సంస్థలకు ప్రత్యేకంగా ప్రయోజనం కల్పించే విధానాన్ని అంతం చేసి, పోటీ వాతావరణాన్ని కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆవిష్కరణలు, కష్టపడి పనిచేసే తత్వంపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థను నిర్మించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. భారత్‌లో స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు వాణిజ్యపర అనుమతులు ఇంకా లభించలేదని స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ చర్చ మొదలైంది. గురువారం రోజు మస్క్ చేసిన ఎక్స్ పోస్టుకు రాహుల్ బదులివ్వడం, మళ్లీ మస్క్ థ్యాంక్యూ చెప్పారు.తాను వ్యాపారాలకు వ్యతిరేకం కాదని, కేవలం గుత్తాధిపత్యానికే వ్యతిరేకమని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఈ మేరకు రాహుల్ తన వాట్సాప్ ఛానల్ ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి

2లో..

## చట్టపరంగా కుదరకపోతేనేం.. పార్టీ పరంగా న్యాయం చేస్తాం

### - బీసీల రిజర్వేషన్లపై టీడీపీ కీలక ప్రకటన

- వైసీపీ వల్లే బీసీలు రిజర్వేషన్లు కోల్పోయారని టీడీపీ ఆరోపణ
- గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో బీసీల కోసం అమలు చేస్తున్న పథకాల వెల్లడి
- బీసీల రాజకీయ ఎదుగుదలకు ఎప్పుడూ అండగా ఉంటామని స్పష్టీకరణ
- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో టీడీపీ ప్రకటన

**అమరావతి (ప్రశ్న న్యూస్)** బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని, ఏది ఏమైనా సరే పార్టీ పరంగానైనా సరే వాటిని అమలు చేస్తామని తెలుగు దేశం పార్టీ కీలక ప్రకటన చేసింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల విషయంలో టీడీపీ కట్టుబడి ఉందని, గత ప్రభుత్వం చేసిన నష్టాన్ని భర్తీ చేస్తూ 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో. 105, జీవో 1065 తెచ్చామని గుర్తుచేసింది. కానీ రిజర్వేషన్లపై గొడ్డలి పార్టీ నేతలు హైకోర్టుకు వెళ్లగా కోర్టులో కొట్టేశారు. అయినా మేం వెనక్కి తగ్గకుండా సుప్రీంకోర్టుకు వెళ్లామని పార్టీ పేర్కొంది. స్వయంగా

2లో..

## సర్‌లో 95 లక్షల ఓట్ల తొలగింపుపై క్లారిటీ

### - సీఈవో సుదర్శన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో 95 లక్షల ఓట్లు తొలగించారంటూ జరుగుతున్న ప్రచారంపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) సి. సుదర్శన్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. ఈ వార్తలో వాస్తవం లేదని ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని తెలిపారు. ఓటర్ల వివరాల పరిశీలన, నోటీసుల

2లో..

## రైతులు హలం పట్టాలి.. అర్జీలు కాదు!

### - రాజముద్రతో భూమికి భరోసా



- 22ఏ నుంచి 16.48 లక్షల ఎకరాల తొలగింపు
- ఇప్పటివరకు 40.58 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ
- రూ.166.40 కోట్లతో పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రైతులు భూమి సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతూ అర్జీలు పెట్టుకునే పరిస్థితి ఉండకూడదని, హలం పట్టుకుని పొలానికి వెళ్లేలా భూమిపై హక్కులకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రీసర్వే 2.0 ద్వారా రాజముద్రతో కూడిన భద్రతా లక్షణాలున్న పట్టాదారు పాస్‌పుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం నర్సింగోలులో శుక్రవారం నిర్వహించిన 'మీ భూమి- మీ హక్కు' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటివరకు

2లో..

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో 45 ఎకరాల మిస్టరీ!

### - నోటీసులు రెడీ.. రాజకీయ భూకంపం తప్పదా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సిద్ధిపేట జిల్లా ఎర్రవల్లిలోని మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఫామ్‌హౌస్ కేంద్రంగా తెలంగాణ రాజకీయాలు మరోసారి వేడెక్కనున్నాయి. ఫామ్‌హౌస్ సరిహద్దుల పరిధిలో లెక్కల్లో లేని దాదాపు 45 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమి కలిసిపోయిందనే అంశంపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం సర్వే నంబరు 325 పరిధిలో మొత్తం 388 ఎకరాల భూమి ఉండాల్సి ఉండగా, రెవెన్యూ అధికారులు నిర్వహించిన ప్రాథమిక సర్వేలో కేవలం 343 ఎకరాలు మాత్రమే క్షేత్రస్థాయిలో తేలడం తీవ్ర వివాదానికి మూలమైంది.

### అదృశ్యమైన ఆ 45 ఎకరాల అసైన్డ్ భూమి ఎటుపోయింది.?

కేసీఆర్ ఫామ్‌హౌస్ హద్దుల లోపలకే ఈ భూమి చేరిందా? అన్న కోణంలో సవివరంగా విచారణ జరపాలని

2లో..

## 22ఏ సమస్యల పరిష్కారంలో కీలక ముందడుగు

### - జీవో 59 బాధితులకు ఊరట.. నెలరోజుల్లో పరిష్కారం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో భూ సంబంధిత సమస్యలతో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు

2లో..

## ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది



- అధికారంలో ఉన్నవారికి ఈసీ రక్షణ కవచం కాదన్న హరీశ్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- అన్నిటికన్నా ప్రజాస్వామ్యం గొప్పదని వ్యాఖ్య

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కేంద్ర ఎన్నికల సంఘం పనితీరు, స్వతంత్రతపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల్లో విశ్వసనీయతను కాపాడలేకపోతే కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

2లో..



## భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం

### - రాష్ట్రాన్ని 7 జోన్లుగా విభజించి రీసర్వే

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎర్రవల్లి లో 385 ఎకరాలలో 45 ఎకరాలు తక్కువ ఉందని సర్వే కోసం మరొక సారి నోటీసులు ఇవ్వడం జరిగిందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

ఎర్రవల్లిలో అసైన్డ్ భూములు కొన్ని చేతులు మారాయి వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అమరవీరులను గుర్తించి వాళ్లకు న్యాయం చేస్తామన్నారు. ఎర్రవెల్లిలో కూడా నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ ల్యాండ్ ఉంటే వాటిని పేదలకు పంచుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.శుక్రవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సర్వే పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన అధికారులతో భూ సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమగ్ర రీ-సర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేసేలా పటిష్ఠ కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.

2లో..

## నవీ పిళ్లైకు నోబెల్ శాంతి పురస్కారం

### - అంతర్జాతీయ న్యాయం కోసం అలుపెరుగని పోరాటం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అంతర్జాతీయ న్యాయం, మానవ హక్కుల కోసం దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న భారత సంతతి న్యాయమూర్తి నవనీతం 'నవీ' పిళ్ళైను 2026 సంవత్సరానికి గాను అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం వరించింది. యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు, జాతి నిర్మూలన వంటి తీవ్రమైన అంశాలపై నేరస్థులను చట్టం ముందు నిలబెట్టేందుకు ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ఈ ప్రకటన చేసింది. అసాధారణమైన ధైర్యం, నైతిక నిబద్ధతతో ప్రపంచ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆమె పోషించిన పాత్రను కమిటీ కొనియాడింది.దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో వర్ణవివక్ష పాలనలో మగ్గుతున్న ఒక భారత తమిళ మూలాలు ఉన్న కుటుంబంలో నవీ పిళ్ళై జన్మించారు. సమాజంలో పాతుకుపోయిన తీవ్రమైన వివక్ష, వేర్పాటువాదాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. వర్ణవివక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన నెల్సన్ మండేలా వంటి ఎందరో ఉద్యమకారులకు ఆమె న్యాయవాదిగా అండగా నిలిచారు.

3లో..

# తెలంగాణపై కరెంట్ షాక్!

కాంగ్రెస్ రేవంత్ సర్కార్‌ను రాజకీయంగా ఇరకాటంలోకి నెట్టింది.

### ప్రభుత్వం ప్రత్యేక జాగ్రత్తలు

డిమాండ్‌కు అనుగుణంగా నిరంతర విద్యుత్ అందించేందుకు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం బహుముఖ వ్యూహాన్ని వేగవంతం చేసింది. అందులో భాగంగా నేషనల్ పవర్ గ్రిడ్ , ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ ద్వారా స్వల్పకాలిక ఒప్పందాల ప్రాతిపదికన బహిరంగ మార్కెట్ నుంచి వేల మెగావాట్ల విద్యుత్‌ను అధిక ధరలైనా సరే కొనుగోలు చేస్తోంది. థర్మల్ ప్లాంట్లలో ఎక్కడా విద్యుత్ ఉత్పత్తి ఆగిపోకుండా సింగరేణి నుంచి తగినంత బొగ్గు నిల్వలను సమకూర్చడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అటు గ్రిడ్ నిర్వహణను శాస్త్రీయంగా తీర్చిదిద్దడానికి సాంకేతిక పద్ధతులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. ఎత్తిపోతల పథకాలకు పీక్ అవర్స్‌లో కాకుండా ఆఫ్–పీక్ అవర్స్‌లో కరెంట్ కేటాయించడం, హైదరాబాద్ వంటి నగరాల్లో సబ్‌స్టేషన్ల అప్‌గ్రేడేషన్ , పవర్ ఐలాండింగ్ సిస్టమ్‌లను అందుబాటులోకి తేవడం వంటి చర్యలు చేపడుతోంది. ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొడుతూ.. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే డిస్కంలు రూ. 57,000 కోట్లకు పైగా బకాయిల్లో కూరుకుపోయాయని, తాము క్రమబద్ధమైన ఆర్థిక క్రమశిక్షణతో విద్యుత్ రంగాన్ని ప్రక్షాళన చేస్తున్నామని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

### అసంతృప్తిని చల్లార్చడం క్లిష్టమైన పరీక్ష

దీర్ఘకాలిక పరిష్కారం కోసం గ్రీన్ ఎనర్జీపై కాంగ్రెస్ సర్కార్ తీవ్ర దృష్టి సారించింది. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ మిగిలిన యూనిట్లను వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, భారీ సోలార్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తోంది. ఉచిత వ్యవసాయ విద్యుత్ బకాయిలకు సంబంధించి రూ. 2,200 కోట్లను డిస్కంలకు సకాలంలో విడుదల చేసి పంపిణీ సంస్థల ఆర్థిక రక్షణకు భరోసా ఇస్తామని ప్రభుత్వం తేల్చిచెప్పింది. విపరీతమైన ఎండలు, వర్షాభావం తెచ్చిపెట్టిన విద్యుత్ సంక్షోభాన్ని అధిగమించి, ప్రజలపై ట్రూ–అప్ చార్జీల భారం వల్ల తలెత్తే రాజకీయ అసంతృప్తిని చల్లార్చడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అత్యంత క్లిష్టమైన పరీక్షగా మారింది. రాబోయే పండుగలు, పంటల సీజన్లలో నిరంతరాయంగా విద్యుత్ అందించడం ద్వారానే ప్రభుత్వం ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సి ఉంటుంది.

## వ్యాపారానికి కాదు, గుత్తాధిపత్యంపైనే పోరు!

సాధించాలంటే ప్రతీ చిన్నా, పెద్ద వ్యాపార సంస్థకు సమాన అవకాశాలు కల్పించాలని, ఇందుకోసం లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఉండాలని డిమాండ్ చేశారు. మరోవైపు వివిధ రంగాల్లో పోటీని తగ్గించి గుత్తాధిపత్యాన్ని ప్రోత్సహిస్తోందని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా విమర్శలు చేశారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలపై ఖర్గే, రాహుల్ గాంధీ శుక్రవారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

### ఇండియాకు అసలు బాస్ అంబానీనా?

అంతకుముందు భారత చట్టాలు, నిబంధనలు అన్నీ పాటిస్తూ ఐదేళ్లుగా చూస్తున్నా స్టార్‌లింక్‌కు ఇండియాలో లైసెన్స్ రాలేదని, గుత్తాధిపత్యం చెలాయిస్తున్న కొందరు బడా వ్యాపారులు తమకు లైసెన్స్ రాకుండా అడ్డుకుంటున్నారని మస్క్ తెలిపారు. ఇంకా ఇండియాకు అసలు బాస్ అంబానీనా? అని మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనికి స్పందించిన రాహుల్ 'వెల్‌కమ్ టు ఇండియా ఎలాన్. మరో వ్యక్తి గురించి కూడా తెలుసుకునే వరకు వెయిట్ చెయ్' అని రిప్లై ఇచ్చారు. దీనికి మస్క్ మళ్లీ థ్యాంక్యూ చెప్పి, ఇది చాలా ఆందోళనకర విషయం అన్నారు. ఈ క్రమంలోనే ప్రతి వ్యాపార సంస్థకు ఇండియాలో సమాన అవకాశాలు ఉండాలని రాహుల్ ఓ వీడియోలో తెలిపారు.ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే కూడా ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. మోదీ ప్రభుత్వ విధానాలు తమకు అనుకూలమైన పెట్టుబడిదారులకే అవకాశం ఇచ్చి ఆర్థిక వ్యవస్థపై నియంత్రణ కలిగి ఉండేలా ఉన్నాయని, దీని ద్వారా బీజేపీ ప్రయోజనాలు పొందుతోందని విమర్శలు గుప్పించారు. మొత్తానికే పోటీని అంతం చేసి గుత్తాధిపత్యం చెలాయిస్తున్న లేదా రెండు ప్రధాన సంస్థల ఆధిపత్యాన్నే ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థ పునాదులు దెబ్బతింటున్నాయని ఖర్గే పేర్కొన్నారు. ఈ విధానాన్ని ఆర్థిక ఉగ్రవాదం (ఎకనామిక్ టెర్రరిజం) అని ఆయన అభివర్ణించారు.

### టెలికాం, విమానయాన రంగంలో పోటీనే లేదు: ఖర్గే

తన వాదనకు బలం చేకూర్చేలా ఖర్గే ఉదాహరణలతో వివరించారు. ఇక్కడ టెలికాం, విమానయాన రంగాలను ఆయన ప్రస్తావించారు. 2014కు ముందు టెలికాం రంగంలో ఇండియాలో 13 సంస్థలు ఉండగా, ప్రస్తుతం 3 ప్రైవేట్ సంస్థలే మిగిలాయని ఖర్గే గుర్తు చేశారు. ఇంకా దేశీయ విమానయాన రంగంలో కూడా 2014కు ముందు వరకు 7 ప్రధాన సంస్థలు ఉండేవని, ప్రస్తుతం అక్కడా రెండు ప్రధాన సంస్థలే మిగిలాయని ఆరోపించారు. ఇంకా వీటికి తోడు డిజిటల్ పేమెంట్స్, ఫుడ్ డెలివరీ యాప్స్, సిమెంట్ వంటి రంగాల్లోనూ క్రమంగా పోటీ లేకుండా చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యంగా మారిందని ఖర్గే విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెద్ద సంఖ్యలో మూతపడుతున్నాయని, యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోందని అన్నారు. ఇదిలా ఉండగా స్టార్‌లింక్ కమర్షియల్ లైసెన్స్ గురించి మస్క్ చేసిన ఆరోపణలను కేంద్రం తోసిపుచ్చింది. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలు అందించడానికి దరఖాస్తు చేసుకున్న అన్ని సంస్థలకు తాము సమాన అవకాశాలు కల్పిస్తున్నామని, వివక్ష లేని న్యాయమైన విధానం అమల్లో ఉందన్నారు. ఇక్కడ అవసరమైన భద్రతా పరిశీలనలు, స్పెక్ట్రమ్‌కు సంబంధించిన అనుమతులు పూర్తయ్యే వరకు ఏ సంస్థ కూడా వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించలేదని తెలిపింది. ఈ క్రమంలోనే స్టార్‌లింక్ అనుమతుల అంశం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

## చట్టపరంగా కుదరకపోతేనేం..

# పార్టీ పరంగా న్యాయం చేస్తాం

బీసీ మంత్రులు ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో చర్చించడంతో పాటు సుప్రీం కోర్టులో విజయం సాధించడానికి సీనియర్ అడ్వకేట్లను కూడా నియమించుకున్నా. దురదృష్టవశాత్తూ సుప్రీం కోర్టు 34 శాతం రిజర్వేషన్ల ను అనుమతించలేదని పార్టీ తెలిపింది.'బీసీల విషయంలో మేం వెనక్కి తగ్గకుండా స్థానిక ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు పార్టీ తరుపున అమలు చేస్తాం. బీసీల ఆత్మ గౌరవాన్ని కాపాడుతాం. స్థానిక సంస్థల్లో వారి ప్రాతినిధ్యం పెంచితీరుతాం. చట్టపరంగా బీసీలకు న్యాయం చేయలేకపోయినా, పార్టీ పరంగా బీసీలకు న్యాయం చేసి చూపిస్తాం. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పిస్తాం. 34 శాతం తగ్గకుండా సీట్లు బీసీ సామాజిక వర్గానికి కేటాయిస్తాం. బీసీల రాజకీయ ఎదుగుదలకు మా పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది. బీసీలకు న్యాయం చేయాలన్నదే తెలుగుదేశం లక్ష్యం వారి హక్కులను అడ్డుకోవడమే వైఎస్సార్ సీపీ వైఖరి. గొడ్డలి పార్టీ కోర్టులకు వెళ్లి, కుట్రలు చేయడంతో పాటు మాపైనే ఆరోపణలు చేస్తోంది. ఆనాడు హైకోర్టు రిజర్వేషన్లు కొట్టేస్తే అధికారంలో ఉన్న వైసీపీ కనీసం అమలు చేయడానికి ప్రయత్నం చేయలేదు.

బీసీలకు రాజ్యాధికారం అని తొలిసారిగా గళం విప్పడంతో పాటు అవకాశాలు కల్పించింది టీడీపీ. పార్టీ వ్యవస్థాపకులు దిగంగత ఎన్టీఆర్ కారణంగా 4 దశాబ్దాల క్రితమే బీసీ గళం, స్వరం వినిపించింది. తరువాత కాలంలో 1995లో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల 34 శాతానికి పెంచాం. టీడీపీకి ఎప్పుడూ అండగా ఉన్నారనే అక్కసుతో బీసీలను అణగదొక్కారు. వారి పాపాలు, తప్పులు అంతటితో ఆగలేదు. బీసీలపై కక్షతో 30 ఏళ్ల నుంచి ఉన్న 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించడంతో 16,800 మంది పదవులు కోల్పోయారని' టీడీపీ ఆ ప్రకటనలో వెల్లడించింది.

### బీసీలకు మేలు చేసింది మేమే

బీసీ ఫెడరేషన్లకు నాంది పలికింది తెలుగుదేశం ప్రభుత్వమేనని, బీసీలు అంటే కులవృత్తులు, చేతి వృత్తులు అన్నారు. వాటిని పరిరక్షించేందుకు, వారి జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఆదరణ వంటి పథకాలు తీసుకువచ్చింది. ఆదరణ పథకం కింద 341 రకాల పనిముట్లను 90 శాతం సబ్సిడీతో అందించాం. కూటమి పాలనలో బీసీల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాం. వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులతో పాటు గీత కార్మికులకు 10శాతం ఎక్సైజ్ షాపులు కేటాయించిన ఘనత మాదే. నేతన్న సేవలో పథకం కింద ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.25,000 వేలు సాయం చేస్తున్నాం. హ్యాండ్లూమ్ మగ్గాలకు కుటుంబానికి నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని టీడీపీ పేర్కొంది. 'వేట నిషేధ సమయంలో మత్స్య కారులకు ఆర్థిక సాయం అందించే పథకాన్ని మేం తీసుకొచ్చాం. మత్స్యకారుల సేవలో పథకంతో వేట విరామం సమయంలో మత్స్యకారులకు రూ.20 వేలు ఇస్తున్నాం. దాన్ని మరింత పెంచాలని యోచిస్తున్నాం. సబ్సిడీలో బోట్లు, డీజిల్ ఇవ్వడంతో పాటు తీర ప్రాంతంలో వేటపై హక్కులకు రక్షణ కల్పిస్తున్నాం. గత వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా తెచ్చిన జీవో నెంబర్ 217 రద్దు చేయగా మత్స్యకార సొసైటీల హక్కుల కాపాడాం. మత్స్య కార మహిళలకు సీ వీడ్ పెంపకంపై శిక్షణ ద్వారా ఉపాధి కల్పించాం. నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్లకు ప్రతినెల 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేశాం. అలాగే ఆలయాల్లో నాయీ బ్రాహ్మణులకు భృతిని రూ.15 వేల నుంచి రూ.25,000కు పెంచాం. ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను రాజకీయంగా అమలు చేస్తామని' టీడీపీ స్పష్టం చేసింది.

# రైతులు హలం పట్టాలి.. అర్జీలు కాదు!

40.58 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేసినట్లు సీఎం వెల్లడించారు. అక్టోబరులో 790 గ్రామాల్లో నాలుగు లక్షలకు పైగా పాస్‌పుస్తకాలు అందించినట్లు చెప్పారు. ఇంకా పంపిణీ చేయాల్సిన పుస్తకాల కోసం నెలవారీ లక్ష్యాలు నిర్దేశించుకుని అర్హులైన రైతులందరికీ అందిస్తామన్నారు.

### 22ఏ నుంచి 16.48 లక్షల ఎకరాలకు విముక్తి

గత పాలనలో భూములపై భద్రత లేకుండా పోయిందని, ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో వివాదాలు ఏర్పడ్డాయని చంద్రబాబు విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ చట్టాన్ని రద్దు చేశామని తెలిపారు. గతంలో 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూములను పరిశీలించి ఇప్పటివరకు 16.48 లక్షల ఎకరాలను తొలగించినట్లు వెల్లడించారు. వివిధ ప్రాంతాల్లో వివాదాల్లో ఉన్న 41 వేల ఎకరాలకు విముక్తి కల్పించినట్లు చెప్పారు.ప్రకాశం జిల్లాలో గర్భకంద్రిక భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పాస్‌పుస్తకాల పంపిణీని స్వయంగా పర్యవేక్షిస్తున్నానని, చివరి రైతు వరకు హక్కు పత్రాలు అందేలా చూస్తానని స్పష్టం చేశారు.

### రూ.166 కోట్లతో పాలేరు రిజర్వాయర్

ప్రకాశం జిల్లా సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు పోతుల చెంచయ్య--పాలేరు రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టినట్లు సీఎం తెలిపారు. రూ.166.40 కోట్లతో రెండేళ్లలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లో 35 వేల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. పొన్నలూరు మండలం వేమూరుపాడు రహదారి, పాలేరు నదిపై వంతెన నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రూ.28 కోట్లతో ఈ పనులు చేపడతామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు రెండో దశను పూర్తి చేసి అన్ని ప్రాంతాలకు నీరందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 36 సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

### ఉద్యానవన హబ్‌గా ప్రకాశం

ఉమ్మడి ప్రకాశం జిల్లాతోపాటు రాయలసీమ ప్రాంతాలను ప్రపంచస్థాయి ఉద్యానవన పంటల కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. గ్రామీణ మౌలిక సదుపాయాల కోసం పల్లె పండుగ కార్యక్రమం కింద రూ.11 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. రామాయపట్నం పోర్టు పనులను వేగవంతం చేస్తున్నామని, యువతకు ఉపాధి కల్పించేలా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు.భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రూ.1.5 లక్షల కోట్లతో రిఫైనరీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా రూ.31 వేల కోట్లతో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.

### బీసీలకు పార్టీ పరంగా 34 శాతం ప్రాతినిధ్యం

బీసీలకు పార్టీ పరంగా 34 శాతం ప్రాతినిధ్యం కల్పించి అండగా ఉంటామని ముఖ్యమంత్రి ప్రకటించారు. న్యాయస్థానాల తీర్పుల నేపథ్యంలో స్థానిక సంస్థల రిజర్వేషన్ల అమలుకు ఆటంకాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి కృషి చేస్తామని చెప్పారు.

### ప్రజాభిప్రాయంతో పాలనలో మార్పులు

ప్రజల అభిప్రాయాల ఆధారంగా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలులో అవసరమైన మార్పులు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఫోన్ ద్వారా ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు, అధికారుల పనితీరును సమీక్షిస్తూ పౌరసేవల్లో పారదర్శకత పెంచుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## సర్‌లో 95 లక్షల ఓట్ల తొలగింపుపై క్లారిటీ

జారీ, విచారణల అనంతరం అర్హత నిర్ధారణ వంటి దశలు పూర్తయిన తర్వాతే తుది జాబితాపై స్పష్టత వస్తుందని వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న గణాంకాలను ఆధారంగా చేసుకుని 95 లక్షల ఓట్లు తొలగించినట్లు చెప్పడం సరైంది కాదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల జాబితా సవరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 73,39,235 మంది ఓటర్లను ఏఎస్‌డీడీ కేటగిరీలో గుర్తించినట్లు సీఈవో వివరించారు.ఈ ఏఎస్‌డీడీ విభాగంలో గైర్హాజరైనవారు, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లినవారు, మరణించినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు నమోదైనవారు ఉంటారని పేర్కొన్నారు. అయితే ఈ కేటగిరీలో చేర్చిన సంఖ్యనే తుది జాబితా నుంచి శాశ్వతంగా తొలగించిన ఓట్ల సంఖ్యగా పరిగణించకూడదని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. సంబంధిత ఓటర్ల వివరాలను పరిశీలించి, నోటీసుల ప్రక్రియను పూర్తి చేసి, అర్హతపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల ముసాయిదా జాబితాలో జరిగిన మార్పులను తుది తొలగింపులుగా భావించడం సరికాదు.ఓటర్ల వివరాల్లో ఉన్న వ్యత్యాసాలు, పాత రికార్డులతో వివరాలను అనుసంధానించలేకపోవడం వంటి కారణాలతో మొత్తం 92,88,187 నోటీసులు జారీ చేసినట్లు సీఈఓ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వీటిలో 92,23,486 నోటీసులు సంబంధిత ఓటర్లకు అందజేశారు. మరో 64,701 నోటీసుల పంపిణీ ఇంకా పూర్తి కావాల్సి ఉందని వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ వివరాలను సమర్పించి, అవసరమైన పత్రాలతో విచారణకు హాజరయ్యే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల అర్హతను నిర్ధారించి, తుది జాబితాలో పేర్లను చేర్చాలా లేదా అనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు.సీఈవో వెల్లడించిన వివరాల ప్రకారం ఇప్పటివరకు 82,11,205 మంది ఓటర్లకు సంబంధించిన విచారణలు పూర్తి అయ్యాయి. తుది ఓటర్ల జాబితాలో చోటు కల్పించేందుకు 74,62,851 మందిని అర్హులుగా గుర్తించారు. మరో 12,969 మందిని అనర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. ఇంకా 18,12,367 మంది ఓటర్లకు సంబంధించిన కేసులపై నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ గణాంకాలు చూపిస్తున్నట్లుగా ఓటర్ల అర్హత నిర్ధారణ ప్రక్రియలో ఇంకా కొన్ని దశలు మిగిలి ఉన్నాయి. అందువల్ల తుది జాబితా ప్రచురణకు ముందే భారీ సంఖ్యలో ఓట్లు తొలగిపోయాయని నిర్ధారించడం సరికాదని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.పెండింగ్‌లో ఉన్న నోటీసులు, క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై నవంబర్ 5వ తేదీలోగా నిర్ణయాలు తీసుకోవాలని ఎన్నికల యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ తర్వాత తుది ఓటర్ల జాబితాను నవంబర్ 9వ తేదీన ప్రచురించేందుకు షెడ్యూల్ ఉంది. మిగిలిన కేసులను గడువులోగా పరిష్కరించి అర్హులైన ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చే ప్రక్రియ కొనసాగుతుందని సీఈవో తెలిపారు. ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవడం ముఖ్యమని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. నోటీసు అందినవారు దాన్ని నిర్లక్ష్యం చేయకుండా.. అధికారులు సూచించిన విధంగా స్పందించి అవసరమైన ఆధారాలను సమర్పించాలని చెబుతున్నారు. పేర్లు, అడ్రస్‌లు, ఇతర వివరాల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు ఎన్నికల అధికారులను సంప్రదించాల్సి ఉంటుందని వివరించారు.మొత్తంగా తెలంగాణలో 95 లక్షల ఓట్లు ఇప్పటికే తొలగించారన్న ప్రచారాన్ని సీఈవో సుదర్శన్ రెడ్డి ఖండించారు. ప్రస్తుతం కొనసాగుతున్నది ఓటర్ల వివరాల పరిశీలన, అర్హత నిర్ధారణ ప్రక్రియ మాత్రమేనని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులపై నిర్ణయాలు, తుది జాబితా ప్రచురణ తర్వాతే ఓటర్ల సంఖ్యపై పూర్తి స్పష్టత రానుంది.

## ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది



ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యానికి వెన్నెముక అధికారంలో ఉన్నవాళ్లకు రక్షణ కవచం కాదు అని మాజీమంత్రి హరీశ్ రావు చెప్పుకొచ్చారు. ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయినప్పుడు ఆ పదవిలో కొనసాగే అర్హత లేదు సీఈసీ పదవికి జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. 'ఓటర్ల హక్కులను కాలరాస్తే కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమారే పూర్తి బాధ్యత వహించాలి. ఈసీ స్వతంత్రత, నియామకాలపై అనుమానాలు రావడం మన రాజ్యాంగ ప్రజాస్వామ్యానికే పెను ముప్పు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులైన పౌరుల నుంచి లాక్కునే హక్కు ఎవరికీ లేదు'అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. ఆర్టికల్స్ 324, 325, 326 సహా ప్రజాప్రాతినిధ్య చట్టాల ప్రకారం ఎన్నికల వ్యవస్థ పూర్తిగా నిష్పాక్షికంగా, పారదర్శకంగా పనిచేయాలి అని సూచించారు.'వ్యక్తులు, ప్రభుత్వాల కంటే కూడా ప్రజాస్వామ్యమే అత్యున్నతమైనది, గొప్పది. గ్యానేష్ ఇట్స్ డన్ బ్రో' అంటూ సీఈసీ వైఖరిని మాజీమంత్రి హరీశ్ రావు ఎండగట్టారు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో 45 ఎకరాల మిస్టరీ!

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల సరిహద్దుల పరిధిలో పూర్తిస్థాయి రీ–సర్వే చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఈ తేడాని నిగ్గుతేల్చేందుకు నేరుగా కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు. రెవెన్యూ యంత్రాంగం జారీ చేయనున్న నోటీసుల ప్రకారం కేసీఆర్ కుటుంబ సభ్యులు తమ అధీనంలో ఉన్న భూములకు సంబంధించిన పట్టాదార్ పాస్‌పుస్తకాలు, పాత రికార్డులు, సేల్ డీడ్లతో స్వయంగా విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఒకవేళ ఈ రీ–సర్వేలో 45 ఎకరాల ప్రభుత్వ లేదా అసైన్డ్ భూమి కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిధిలోనే ఉంటే, దానిని వెంటనే స్వాధీనం చేసుకుని పేద రైతులకు పంచడం, తెలంగాణ అమరుల కాలనీకి కేటాయించడం జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### ధరణి పోర్టల్ అవకతవకలు బయటపడతాయా?

ఈ భూమి వివాదం ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో తుఫాను సృష్టిస్తోంది. బిఆర్ఎస్ నేతృత్వంలోని గత ప్రభుత్వం ధరణి పోర్టల్ ద్వారా భూ రికార్డుల్లో అవకతవకలకు పాల్పడిందని కాంగ్రెస్ నిరంతరం ఆరోపిస్తూ వస్తోంది. ఇప్పుడు ఏకంగా మాజీ సీఎం ఫామ్‌హౌస్ ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల లెక్కింపులోనే ఈ స్థాయిలో వ్యత్యాసాలు వెలుగుచూడటంతో కాంగ్రెస్ శ్రేణులు బిఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి. అటు బిఆర్ఎస్ వర్గాలు మాత్రం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ రకమైన మిస్సింగ్ భూముల ప్రచారాన్ని తెరపైకి తెస్తోందని మండిపడుతున్నాయి. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములన్నీ చట్టబద్ధంగా కొనుగోలు చేసినవేనని, రికార్డులు పక్కాగా ఉన్నాయని పార్టీ నేతలు వాదిస్తున్నారు.

### భూపోరాటం తప్పదా.?

పొలం సరిహద్దులు, రికార్డుల్లో ఉన్న సాంకేతిక లోపాలను చూపుతూ రాజకీయంగా బద్నాం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని బిఆర్ఎస్ విమర్శిస్తోంది. రాబోయే రోజుల్లో రెవెన్యూ అధికారులు అధికారికంగా నోటీసులు ఇచ్చి, రీ–సర్వేను క్షేత్రస్థాయిలో ప్రారంభించినట్లయితే ఎర్రవల్లి వద్ద ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది. ప్రధాన రాజకీయ పార్టీల మధ్య ఈ భూపోరాటం రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాల్సిందే.

## 22ఏ సమస్యల పరిష్కారంలో కీలక ముందడుగు

తెలంగాణ ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా జీవో 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ శాఖ దృష్టి సారించింది. 500 చదరపు గజాలు, అంతకంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం అందిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రక్రియకు సంబంధించి మెమో నంబర్ 48030ను జారీ చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు.గతంలో జారీ చేసిన జీవోలు 14, 22, 29, 41కు అనుగుణంగా దరఖాస్తులను పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అర్హులైన వారికి న్యాయం జరిగేలా, నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. జీవో 59 పరిధిలోని భూములకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించేటప్పుడు భూ రికార్డులు, దరఖాస్తుదారుల అర్హత, క్రమబద్ధీకరణకు అర్హమైన స్థలం విస్తీర్ణం వంటి అంశాలను సమగ్రంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు బయటపడితే ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం తగిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.గతంలో జీవో 59 అమలులో కొన్ని అక్రమాలు జరిగినట్లు తమ దృష్టికి రావడంతో ఆ ప్రక్రియను నిలిపివేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇంతకుముందు తప్పులు పునరావృతం కాకుండా పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే కన్వేయన్స్ డీడ్స్ జారీ చేసిన కేసులను సైతం మరోసారి సమగ్రంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. కోర్టుల్లో విచారణలో ఉన్న దరఖాస్తుల విషయంలో సంబంధిత కోర్టుల ఆదేశాలకు అనుగుణంగానే తుది నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు.సెక్షన్ 22–ఎ కింద భూములు, ఆస్తులకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ప్రభుత్వం వివిధ అంశాలపై దశలవారీగా చర్యలు చేపడుతోందని మంత్రి వివరించారు. సీఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే ఈ సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు పలు కీలక ఉత్తర్వులు, మార్గదర్శకాలు జారీ చేశామని పేర్కొన్న ఆయన దాదాపు 10 నుంచి 12 రకాల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జీవో 118, జీవో 76లకు అనుగుణంగా కూడా స్పష్టమైన మెమోలు జారీ చేసినట్లు వివరించారు.

## భూ వివాద రహిత

# తెలంగాణే లక్ష్యం

### 125 ఏళ్ల తర్వాత సమగ్ర భూ సర్వే

సర్వేలో వేగం, నాణ్యతతో పాటు ప్రతి దశలో నిరంతర పర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో సుమారు 125 ఏళ్ల తర్వాత సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టామని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు లభించిన ఈ అవకాశాన్ని అధికారులు అత్యంత బాధ్యతతో వినియోగించుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

రీ–సర్వేను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించేందుకు 7 జోన్లకు ఒక్కో జోన్‌కు రెవెన్యూ , సర్వే విభాగాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 14 మంది అధికారులను నియమించినట్లు మంత్రి తెలిపారు. సర్వే జరుగుతున్న తీరును, నాణ్యతను, ప్రజల స్పందనను ఎప్పటికప్పుడు పరిశీలించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

### 365 నక్షాలేని గ్రామాల్లో సర్వే

రాష్ట్రంలో తొలి దశలో 365 నక్షాలేని గ్రామాల్లో అలాగే జిల్లాకు 70 గ్రామాల చొప్పున 2,240 మొత్తం 2768 గ్రామాల్లో రీసర్వే ముమ్మరంగా సాగుతుందని ఇప్పటివరకు 245 గ్రామాల్లో సర్వే పూర్తి చేయడం జరిగిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ సర్వేను పర్యవేక్షించేందుకు 14 మంది అధికారులను పర్యవేక్షకులుగా నియమించడం జరిగిందని తెలిపారు. మొదటి దశ సర్వేను నవంబర్ చివరినాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రతి మండలంలో కనీసం రెండు రెవెన్యూ గ్రామాల్లో సర్వే తప్పనిసరిగా చేపట్టేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేశామని, ఒక్కో బృందంలో లైసెన్స్‌డ్ సర్వేయర్, జీపీవో, డిప్యూటీ తహసీల్దార్ లేదా ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ తదితర సిబ్బంది ఉంటారని వివరించారు. సర్వే జరుగుతున్న ప్రాంతాల్లో ప్రతి రోజు తహసీల్దార్ పర్యటించి పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ రోజు ఎక్కడ సర్వే జరిగింది? ఎన్ని ఎకరాలు/సర్వే నంబర్లు పూర్తయ్యాయి? ఎన్ని గ్రామాల్లో పని జరుగుతోంది? ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది? సర్వేలో ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా? అనే అంశాలపై అధికారులు ప్రతిరోజూ స్పష్టమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు.చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా, భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీ–సర్వే జరగాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

### హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డు

రీ––సర్వేను రాష్ట్రస్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. సర్వే పురోగతి, రోజువారీ పనితీరు, గ్రామాల వారీగా పూర్తయిన సర్వే, పనిచేస్తున్న సర్వే బృందాలు, ఉపయోగిస్తున్న రోవర్లు, వాటి లొకేషన్ వంటి వివరాలన్నీ డాష్‌బోర్డులో రియల్‌టైమ్‌లో కనిపించేలా టెక్నాలజీని వినియోగించాలని సూచించారు. సర్వేకు అవసరమైన సర్వేయర్లు, రోవర్లు, సర్వర్లు, ఇతర సాంకేతిక పరికరాలు, సామగ్రి కొనుగోలుకు నిధుల కొరత ఉండదని స్పష్టం చేశారు. అవసరమైన నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేస్తుందని, అదనపు రోవర్లను కూడా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. రీ–సర్వే ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైనదని ప్రతి వారం రాష్ట్రస్థాయిలో అధికారులు సమీక్ష నిర్వహించాలని, ప్రతి 15 రోజులకు తాను స్వయంగా సమీక్షించి పురోగతిని పరిశీలిస్తానని తెలిపారు.ప్రభుత్వ భూముల సర్వే సమయంలో సరిహద్దులను గుర్తించే ప్రక్రియలో సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. రీ–సర్వే పేరుతో స్థానికంగా ఎవరైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని మంత్రిగారు హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

# విద్యా, వైద్యం కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

## ఎంపీ ఈటెల రాజేందర్

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ప్రభుత్వ పథకాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పేదలకు అందించే విద్యా, వైద్యం పట్ల మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ ) సమావేశం నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి (మేడ్చల్), మర్రి రాజశేఖర్ రెడ్డి (మల్కాజిగిరి), బండారి లక్ష్మారెడ్డి (ఉప్పల్), మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సైబరాబాదు మున్సిపల్ కమిషనర్ సృజన అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జోనల్ కమీషనర్ పింకేష్ కుమార్ తో పాటు మున్సిపల్ ఛైర్మన్లు, అన్ని శాఖల కేంద్ర మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ శాఖల వారీగా సమీక్ష జరుపుతూ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. మల్కాజిగిరి, సైబరాబాద్ కమీషనరేట్ ల పరిధులలో నీడలేని పేదవారికి ఆశ్రయం కల్పించే విధంగా హోమ్ లెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన మౌళిక వసతులు కల్పిస్తూ పరిశుభ్రత పాటించాలని, గర్భిణీలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో రాజీ పడకూడదని సూచించారు. అంగన్ వాడీ కేంద్రాలలో టీచర్లు, ఆయాల కొరత భర్తీ చేసి పనితీరును మెరుగుపరచాలన్నారు. గృహ హింసకు గురవుతున్న మహిళలకు అండగా ఉండేందుకు సఖి కేంద్రాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాలతో కూడిన లేబర్ రూం, నిరంతరాయం విద్యుత్తు సరఫరా ఉండేలా, మందుల కొరత లేకుండా, సరిపడ వైద్యులు, పారా మెడికల్ సిబ్బందిని భర్తీ చేసుకొని పేదలకు మెరుగైన వైద్య సహాయం 24 గంటలు అందించాలన్నారు.

అందుకు అవసరమైన వైద్య పరికరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన పేద కార్మికులకు అత్యవసర చికిత్సను అందించడానికి అన్ని ఆసుపత్రులలో సేవలు కల్పించడానికి కృషి చేయాలనీ మెడికల్ అధికారులను ఆదేశించారు. నగర వనాల యోజన కింద పట్టణ పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించాలని, రోడ్ల విస్తరణకు సంబంధించి అటవీ శాఖ త్వరగా అనుమతులను అందించాలని అన్నారు. అదేవిధంగా జిల్లాలోని పార్కులను అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. వెట్ ల్యాండ్ చెరువులను గుర్తించి కంచె ఏర్పాటు చేయాలన్నారు. యువతకు ఉపాధి కల్పించడానికి గాను స్కిల్ డెవలప్మెంట్ లో శిక్షణ ఇచ్చి, ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లభించేలా చూడాలని ఎంపీ అధికారులను కోరారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ పారిశ్రామిక విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, బ్యాంకులు అందించే రుణాల పై అవగాహన కల్పిస్తూ , బలహీన వర్గాలకు , విద్యార్థులకు, స్వయం సహాయ సంఘాలకు, ఇతరులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణాలు మంజూరు చేయాలని సూచించారు. పరిశ్రమల శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ పరిశ్రమలకు రుణాలను సకాలంలో అర్హులకు అందించాలన్నారు, CSR (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులను వివిధ అభివృద్ధి పనులకు మౌలిక సదుపాయాలు కలిపించడానికి ఉపయోగించాలన్నారు. జిల్లా ఖనిజ నిధులను ప్రధానంగా విద్య, వైద్యం, అత్యవసర మౌలిక సదుపాయాల కోసం వినియోగించాలని స్పష్టం చేశారు. నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, పిఆర్ ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో అందించే అల్పాహారం, మధ్యాన్న భోజనం మెను ప్రకారం నాణ్యమైన ఆహారం అందించడమే కాకుండా, మెను బోర్డును ప్రదర్శించాలన్నారు. స్కూల్స్ లలో విద్యార్థులకు ఎప్పటికప్పుడు డిఎంఅండ్ హెచ్ ఓ సహకారంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలనన్నారు. పాఠశాలల్లో క్రీడలను ప్రొత్సహించడం ద్వారా విద్యార్థులు మానసికంగా, శారీరకంగా బలోపేతం అవుతారన్నారు. డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులలో పారదర్శకంగా ఏంపిక చేస్తూ కడునిరుపేద ప్రజలకు ప్రాధాన్యతనిస్తూ ఇళ్లు కేటాయించాలన్నారు.

ఎలినినో ప్రభావం భారీన పడకుండా అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ పరికరాలు, ఎరువులు, రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



# నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ సర్కిల్ గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధి మైసమ్మగూడ లోని నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలు అత్యంత ఘనంగా, కోలాహలంగా నిర్వహించారు.కళాశాల ప్రాంగణం మొత్తం బతుకమ్మ పూలతో, రంగురంగుల ముగ్గులతో కళకళలాడింది. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి వివిధ రకాల పూలతో విద్యార్థినులు అందంగా బతుకమ్మలను పేర్చారు.ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకునేలా బతుకమ్మల చుట్టూ చేరి, తెలంగాణ జానపద గీతాలు ఆలపిస్తూ అడుగులు వేశారు. బతుకమ్మ పాటలకు అనుగుణంగా వారు చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు బతుకమ్మ పండుగ యొక్క చారిత్రక నేపథ్యాన్ని, దాని ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను మరియు బతుకమ్మలో ఉపయోగించే ప్రతి పువ్వు యొక్క ఔషధ గుణాలను, పర్యావరణ పరిరక్షణలో వాటి పాత్రను తెలియచేశారు.వేడుకల్లో మరో ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థులు, అధ్యాపకులు కలిసి చేసిన దాండియా నృత్యం నిలిచింది. ఉత్సాహభరితమైన సంగీతానికి అనుగుణంగా వారి నృత్యం సందడి వాతావరణాన్ని నెలకొల్పింది.ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాదు, ఇది మన సంస్కృతికి, ప్రకృతికి, మహిళా సాధికారతకు ప్రతీక అని, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులలో మన సంప్రదాయాల పట్ల గౌరవాన్ని, ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.అనంతరం కళాశాల డైరెక్టర్ డా ఏ మోహన్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ చదువుతున్న మీరు, టెక్నాలజీతో పాటు మన మూలాలను, మన సంస్కృతిని కూడా మర్చిపోకూడదని, ఇలాంటి పండుగలు మనలో ఐక్యతను, సృజనాత్మకతను పెంపొందిస్తాయని అన్నారు.తదనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా ఆర్ లోకానాథం మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర పూల పండుగ అయిన బతుకమ్మ సంబరాలను మన కళాశాల ప్రాంగణంలో అంత ఉత్సాహంగా నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని,బతుకమ్మ పండుగ మనకు ప్రకృతితో మమేకమై జీవించడం ఎలాగో నేర్పుతుందని, తొమ్మిది రోజుల పాటు తొమ్మిది రకాల పూలతో అమ్మవారిని కొలిచే ఈ పండుగ, మహిళల్లో ఉన్న శక్తిని, ఓర్పును, సృజనాత్మకతను చాటి చెబుతుందని, చదువుతో పాటు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల మీలో నాయకత్వ లక్షణాలు, జట్టుగా పని చేసే తత్వం పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ జానపద గాయిని జీడికంటి కళ్యాణి విచ్చేసి, వివిధ జానపద గేయాలతో అలరించారు. అనంతరం అందంగా బతుకమ్మ ను పేర్చిన విభాగానికి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జె నర్సింహారెడ్డి కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి , కోశాధికారి జె. త్రిలోక్ రెడ్డి ,







డైరెక్టర్ డా. ఏ. మోహన్, ప్రిన్సిపాల్ డా. ఆర్. లోకనాథం , వివిధ విభాగాధిపతులు, కార్యక్రమ సమన్వయకర్త స్వప్న రాధమ్మ , అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పన్నుల తనిఖీల్లో ప్రైవేటు పెత్తనం

**వసూళ్లకు వాహన తనిఖీలు వేదికా.?**

**గుంటూరు టోల్‌గేట్ నుంచి పొందుగల వరకు ఆరోపణల వెల్లువ**

**ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందని ఫిర్యాదులు**

**అధికారుల ముసుగులో ప్రైవేటు సిబ్బంది విధులపై ప్రశ్నలు**

**చీఫ్ కమిషనర్ విచారణ చేపట్టేనా.?**

గుంటూరు(ప్రశ్న న్యూస్) ప్రభుత్వ ఖజానాకు పన్నుల రూపంలో ఆదాయం పెంచాలి.. అక్రమ రవాణాను అరికట్టాలి.. పన్ను ఎగవేతకు పాల్పడే వ్యాపారులపై నిఘా పెట్టాలి.. ఇదీ వాణిజ్య పన్నుల శాఖ లక్ష్యం. ఇందుకోసం ఉన్నతాధికారులు కొత్త విధానాలతో వాహన తనిఖీలను చేపడుతున్నట్లు తెలుస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో ఆ విధానాల అమలు తీరుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారుల పర్యవేక్షణలో జరగాల్సిన తనిఖీల్లో ప్రైవేటు డ్రైవర్లు, అటెండర్ల పాత్రపై ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. తనిఖీల పేరుతో వ్యాపారులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో వాణిజ్య పన్నుల శాఖలో జవాబుదారీతనం ఎక్కడన్న ప్రశ్న వినిపిస్తోంది.

గుంటూరు టోల్‌గేట్ పరిసర ప్రాంతాలు, ఆటోనగర్ పార్సిల్ కార్యాలయం, గుంటూరు చుట్టుపక్కల సరుకు రవాణా మార్గాలు, ఆంధ్రప్రదేశ్--తెలంగాణ సరిహద్దులోని పొందుగల వద్ద తనిఖీల నిర్వహణపై ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. పన్నుల రాబడి పెంచాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారులు ప్రవేశపెట్టిన విధానం ఆశించిన ఫలితాలను ఇస్తోందా? లేక క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపాలతో దుర్వినియోగానికి అవకాశం కల్పిస్తోందా? అన్నది తేలాల్సి ఉంది.

### కొత్త విధానం.. పాత సమస్యలేనా?

గతంలో గుంటూరు-1, గుంటూరు-2 డివిజన్లకు చెందిన అధికారులు వాహన తనిఖీల విధులు నిర్వహించేవారని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆర్వో కార్యాలయం, ప్రధాన కార్యాలయం నుంచి అధికారులను వాహన రవాణా తనిఖీలకు పంపుతున్నట్లు చెబుతున్నారు. ఈ మార్పుతో పన్నుల ఎగవేతను గుర్తించి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలన్నది లక్ష్యంగా కనిపిస్తోంది.అయితే తనిఖీలకు వెళ్లే అధికారులతో పాటు ప్రైవేటు డ్రైవర్లు, అటెండర్లు కూడా విధులకు వెళుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షించాల్సిన చోట ప్రైవేటు సిబ్బంది వ్యాపారులు, లారీ డ్రైవర్లతో వ్యవహారాలు నడుపుతున్నారన్న ఫిర్యాదులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? ఎవరెవరు ఏ హోదాలో విధులకు వెళుతున్నారు? తనిఖీల సమయంలో అధికారికంగా ఎవరికి ఏ బాధ్యత అప్పగిస్తున్నారు? అన్న వివరాలను శాఖ ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.ప్రైవేటు డ్రైవర్ విధి వాహనం నడపడానికే పరిమితమా? లేక సరుకు తనిఖీ, పత్రాల పరిశీలన, పన్ను ఎగవేత గుర్తింపు వంటి అధికారిక కార్యకలాపాల్లోనూ జోక్యం చేసుకుంటున్నారా? విధుల పరిధి స్పష్టంగా లేకపోతే తనిఖీల్లో జవాబుదారీతనం ఎలా నిర్ధారిస్తారన్నది కీలక ప్రశ్నగా మారింది.

### పార్సిల్ కార్యాలయం వద్ద ఏం జరుగుతోంది?

గుంటూరు ఆటోనగర్‌లోని పార్సిల్ కార్యాలయం, పరిసర ప్రాంతాల్లో సరుకుతో వచ్చే లారీల తనిఖీల విషయంలోనూ ఫిర్యాదులు వెలుగులోకి వచ్చాయి. అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ లేకుండానే ప్రైవేటు సిబ్బంది వాహనాల వద్దకు వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ. ఈ ఆరోపణలు నిజమైతే, అది కేవలం శాఖాపరమైన క్రమశిక్షణ సమస్య మాత్రమే కాదు.. ప్రభుత్వ పన్నుల వ్యవస్థపై ప్రజలకు ఉండాల్సిన నమ్మకానికి సంబంధించిన అంశం.వ్యాపారులు పంపే సరుకుకు




సంబంధించిన పత్రాలు, పన్నుల చెల్లింపులు, రవాణా వివరాలను పరిశీలించాల్సిన బాధ్యత అధికారికంగా నియమితులైన సిబ్బందిదే. అలాంటి సమయంలో ప్రైవేటు వ్యక్తులు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రావడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. తనిఖీలకు సంబంధించిన రికార్డులు, విధుల కేటాయింపు వివరాలు, వాహనాల రాకపోకల నమోదు, సంబంధిత అధికారుల నివేదికలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.ఆంధ్రప్రదేశ్--తెలంగాణ సరిహద్దులోని పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగల ప్రాంతంలో వాహన తనిఖీల నిర్వహణపై కూడా ఫిర్యాదులో పలు అంశాలు ప్రస్తావించారు. అక్కడ రాత్రి విధులకు ఒక ప్రైవేటు వ్యక్తిని అధికారులు పిలుస్తున్నారని, అతను సుమారు 25 ఏళ్లుగా ఇలాంటి విధులకు వెళుతున్నాడని ఆరోపించారు. ఆ వ్యక్తిపై గతంలో ఏసీబీ దాడి జరిగిందని, విచారణ కొనసాగుతోందని కూడా ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు.

# నవీ పిళ్ళైకు నోబెల్ శాంతి పురస్కారం

తన సుదీర్ఘ కెరీర్‌లో ఆమె దక్షిణాఫ్రికా హైకోర్టు న్యాయమూర్తిగా, రువాండా అంతర్జాతీయ క్రిమినల్ ట్రైబ్యునల్ (ఐసీటీఆర్), అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) న్యాయమూర్తిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గానూ సేవలందించారు. ఇటీవల వరకు ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై యూఎన్ ఏర్పాటు చేసిన స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు అధ్యక్షత వహించారు. ప్రస్తుతం ఆమె మయన్మార్‌పై నమోదైన జాతి నిర్మూలన కేసులో అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే)లో న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు.రువాండా ట్రైబ్యునల్‌లో నవీ పిళ్ళై పాత్ర చరిత్రాత్మకమైనది. అత్యాచారం, లైంగిక హింసను కేవలం సాధారణ నేరాలుగా కాకుండా, మానవత్వానికి వ్యతిరేక నేరాలుగా, జాతి నిర్మూలన చర్యగా పరిగణించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. కేవలం విద్వేషపూరిత ప్రచారం ద్వారా జాతి నిర్మూలనకు ప్రేరేపించారన్న ఆరోపణలపై ఒక నిందితుడిపై విచారణ జరగడంలోనూ ఆమె ప్రభావం ఉంది. ఇది అంతర్జాతీయ న్యాయ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది.ప్రపంచంలో యుద్ధాలు, ఘర్షణలు పెరిగిపోతున్నాయని, అంతర్జాతీయ చట్టబద్ధ పాలన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని నోబెల్ కమిటీ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. అధికార రాజకీయాల ప్రాబల్యం పెరిగి, న్యాయ వ్యవస్థలు బలహీనపడుతున్నాయని పేర్కొంది. ఇలాంటి క్లిష్ట సమయంలో, శాంతికి న్యాయమే పునాది అని, అరాచకం, అధికార దర్పం మధ్య న్యాయాన్ని కాపాడే న్యాయమూర్తుల పాత్ర అత్యంత కీలకమని నొక్కి చెప్పింది.నవీ పిళ్ళై వంటి ధైర్యవంతులు దేశాలను, నాయకులను జవాబుదారీగా నిలబెడుతూ, హింస బాధితులకు ఆశాకిరణంగా నిలుస్తున్నారని ప్రశంసించింది. ఆమె నిబద్ధత, స్వాతంత్ర్యం, అపారమైన అనుభవం ఆమెను మన కాలంలోని అత్యంత గౌరవనీయమైన అంతర్జాతీయ న్యాయవేత్తలలో ఒకరిగా నిలబెట్టాయని కమిటీ పేర్కొంది. ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆశయాలకు అనుగుణంగా దేశాల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడంలో ఆమె చేసిన కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడింది.

# రాజముద్రతో రైతులకు కొత్త పాసుపుస్తకాలు

**బుచ్చిరెడ్డిపాళెంలో పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి**

**వరి నార్ల విషయంలో వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి**

**దామరమడుగులో ఉద్యాన పంటల పరిశీలన.. రైతులతో ముఖాముఖి**



బుచ్చిరెడ్డిపాళెం(ప్రశ్న న్యూస్) రైతుల భూములపై హక్కులకు భరోసా కల్పించేందుకు రాజముద్రతో కూడిన కొత్త పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. శుక్రవారం బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దారు కార్యాలయంలో రైతులకు పాసుపుస్తకాలను అందజేశారు. మండలాల వారీగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేస్తూ అర్హులైన రైతులకు కొత్త పాసుపుస్తకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాల వల్ల రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రీసర్వే ప్రక్రియను చేపట్టిందన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల రైతులకు దశలవారీగా కొత్త పాసుపుస్తకాలు అందించే చర్యలు చేపట్టినట్లు వివరించారు.

### సాగులో అప్రమత్తత అవసరం

ఈసారి పంటలు మంచి దిగుబడులు ఇవ్వడంతో రైతులు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో వ్యవసాయ పనుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి నార్లు పోసే రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు మేలు జరగాలని ఆకాంక్షించారు.రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన పంట కాలువల నిర్మాణంతో పాటు ధాన్యం రవాణాకు ఉపయోగపడే వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు ఏవైనా సమస్యలు, అవసరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

### తోటల్లో పర్యటించి.. పంటల కోత

అనంతరం దామరమడుగులో ఉద్యాన పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటల సాగు విధానం, దిగుబడులు, మార్కెట్ ధరలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తోటలో స్వయంగా కూరగాయలు, బంతిపూలు కోసి, వాటి మార్కెట్ ధరలను తెలుసుకుని కొనుగోలు చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగులో ఎదురవుతున్న పరిస్థితులపై ఆరా తీశారు.

# స్థానిక ఎన్నికలపై పవన్ ప్రత్యేక దృష్టి

**25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో అడ్‌హాక్ కమిటీలు**

**క్షేత్రస్థాయి సమాచార సేకరణకు ఆదేశాలు**

### నాలుగు కేంద్ర కమిటీల ఏర్పాటు

అమరావతి(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, ఎన్నికలకు సన్నద్ధం కావడమే లక్ష్యంగా 25 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో అడ్‌హాక్ కమిటీల ఏర్పాటుకు నిర్ణయించారు.క్షేత్రస్థాయిలో పరిస్థితులు, పార్టీ బలాబలాలు, స్థానిక సమస్యలు, ఎన్నికల సన్నద్ధతకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలని కమిటీలకు ఆదేశించారు. కమిటీల పనితీరును పవన్ కల్యాణ్ స్వయంగా పర్యవేక్షించనున్నారు. త్వరలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ కమిటీ సభ్యులతో సమావేశమై ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు.



### నాలుగు కేంద్ర కమిటీలు

స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల నిర్వహణ, మార్గదర్శక కమిటీతో పాటు కూటమి సమన్వయ కమిటీ, ప్రచార కమిటీ, ట్రెజరీ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, ప్రచార వ్యూహాలు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై ఈ కమిటీలు దృష్టి సారించనున్నాయి.విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం మినహా మిగిలిన పార్లమెంట్ కమిటీల వివరాలను ప్రకటించాలని నిర్ణయించారు. స్థానిక ఎన్నికలకు ముందుగానే పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేయడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# సామాన్యులకు 'జగన్మాత దివ్య దర్శన్'

### రూ.1,000తో బంగారు వాకిలి నుంచి అమ్మవారి దర్శనం

### 11, 12, 13 తేదీల టికెట్లు 'మన మిత్ర'లో విడుదల

### కుమ్మరిపాలెం నుంచి కొండపైకి ఉచిత బస్సు



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు వచ్చే సామాన్య భక్తులకు సిఫార్సులతో పనిలేకుండా అమ్మవారి దర్శనం కల్పించేందుకు దేవస్థానం 'జగన్మాత దివ్య దర్శన్' టికెట్లను అందుబాటులోకి తెచ్చింది. ఈ టికెట్లను ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ శుక్రవారం విడుదల చేశారు. తొలి మూడు రోజులు.. అక్టోబరు 11, 12, 13 తేదీలకు సంబంధించిన టికెట్లను రాష్ట్ర ప్రభుత్వ 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

#### బంగారు వాకిలి నుంచి దర్శనం

ఈ ప్రత్యేక దర్శనం టికెట్ ధర రూ.1,000గా నిర్ణయించారు. టికెట్లు బుక్ చేసుకున్న భక్తులను కుమ్మరిపాలెం సెంటర్‌లోని టీటీడీ స్థలం నుంచి ప్రత్యేక బస్సుల్లో ఉచితంగా కొండపైకి తీసుకెళ్తారు. ఓం టర్నింగ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్ ద్వారా ఆలయంలోని ముఖ మండపం (బంగారు వాకిలి) నుంచి అమ్మవారి దర్శనం కల్పిస్తారు. భక్తులు 9552300009 వాట్సాప్ నంబరుకు సందేశం పంపి టికెట్లు నమోదు చేసుకోవచ్చు. మూలా నక్షత్రం రోజును మినహాయించి ఇతర రోజులకు విడతలవారీగా టికెట్లు విడుదల చేయనున్నట్లు ఈవో వెల్లడించారు.

#### ఉచిత దర్శనానికి నాలుగు క్యూలైన్లు

దసరా ఉత్సవాల సందర్భంగా రూ.500, రూ.300, రూ.100 ప్రత్యేక దర్శనం టికెట్లను రద్దు చేసి, ఉదయం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు నాలుగు క్యూలైన్ల ద్వారా ఉచిత దర్శనం కల్పిస్తున్నట్లు ఈవో తెలిపారు. స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, రాత్రి 7.45 నుంచి 9.45 గంటల వరకు దర్శన సమయం కేటాయించినట్లు వివరించారు.
రూ.1,000 టికెట్‌పై సాధారణ ప్రత్యేక దర్శనం రోజుకు నాలుగు గంటలపాటు మాత్రమే అందుబాటులో ఉండగా, 'జగన్మాత దివ్య దర్శన్' ద్వారా సిఫార్సులు లేకుండా సామాన్య భక్తులకు ఎనిమిది గంటలపాటు ప్రత్యేక దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. భక్తులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా అధికారిక వాట్సాప్ సేవ ద్వారా ముందుగానే టికెట్లు బుక్ చేసుకోవాలని ఈవో సూచించారు.

# మహిళా వ్యాపారాలకు ఎక్స్‌పోలు వేదికలు

### హోమ్‌గ్రోన్ బిజినెస్‌లు, విద్యార్థుల స్టార్టప్‌లను ప్రోత్సహించాలి

### 'ది డ్యుయో ఎడిట్' లైఫ్‌స్టైల్ ఎక్స్‌పోలో

### మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ రాయపాటి





తాడేపల్లి(ప్రశ్న న్యూస్) గృహ ఆధారిత వ్యాపారాలు నిర్వహించే మహిళలకు, విద్యార్థులు ప్రారంభించే స్టార్టప్‌లకు సమాజం ప్రోత్సాహం అందించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. శైలజ రాయపాటి అన్నారు. తాడేపల్లిలో తొలిసారిగా ఏర్పాటు చేసిన 'ది డ్యుయో ఎడిట్' లైఫ్‌స్టైల్ ఎక్స్‌పోను శుక్రవారం ఆమె సందర్శించారు. నిర్వాహకులు రమ్య, దీపికలను అభినందించారు.విజయవాడ, గుంటూరు వంటి నగరాల్లో ఎక్కువగా నిర్వహించే లైఫ్‌స్టైల్ ఎక్స్‌పోను తాడేపల్లిలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మంగళగిరి, తాడేపల్లి పరిసర ప్రాంతాల ప్రజలకు వివిధ రకాల ఉత్పత్తులను ఒకే వేదికపై చూసి కొనుగోలు చేసే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. దసరా పండుగ సమయంలో ఈ ప్రదర్శన వ్యాపారులకు, వినియోగదారులకు ప్రయోజనకరమన్నారు.

#### మహిళలకు మార్కెటింగ్ అవకాశం

విజయవాడ, తెనాలి తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు తమ ఉత్పత్తులతో స్టాళ్లు ఏర్పాటు చేయడం విశేషమన్నారు. ఇంటి నుంచే వ్యాపారాలు నిర్వహించే మహిళలకు తమ ఉత్పత్తులను పరిచయం చేసుకోవడానికి, కొత్త వినియోగదారులను చేరుకోవడానికి ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయని తెలిపారు. ఆభరణాలు, ఆహార పదార్థాలు, దుస్తులు, కళాకృతులు, నెయిల్ ఆర్ట్ తదితర ఉత్పత్తులు, సేవలకు చోటు కల్పించడం అభినందనీయమన్నారు. తాడేపల్లిలో ఏటా ఇలాంటి ఎక్స్‌పోలను నిర్వహిస్తూ మహిళా వ్యాపారవేత్తలకు, యువ పారిశ్రామికవేత్తలకు మరిన్ని అవకాశాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు.

## పూలను పూజించి .. ప్రకృతిని ఆరాధించే

# సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండగ

**(బతుకమ్మ సందర్భంగా ప్రత్యేకం)**

తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీకైన పూల పండుగ బతుకమ్మ వేడుకల సందడి మొదలైంది. ప్రతి ఇంటిని పూలతో నింపి, మహిళ ఉత్సాహం, ఉత్తేజాన్ని రేకెత్తించే బతుకమ్మ పండుగ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందింది. భాద్రపద మాసంలో మొదలై తొమ్మిది రోజుల పాటు సాగే ఈ వేడుక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. పూలను పూజించే విశిష్టమైన పండుగ బతుకమ్మ. ఆడబిడ్డలందరు అత్తవారింటి నుంచి పుట్టింటికి చేరి తీరొక్క పూలను సేకరించి బతుకమ్మలను పేర్చి అంగరంగ వైభవంగా బతుకమ్మ పండగను జరుపుకుంటారు. రంగురంగుల పూలను పేర్చి అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టు స్త్రీలు వలయంగా తిరుగుతు ఆడుతు పాడుతు సందడి చేస్తారు. ఆనందం, ఆధ్యాత్మికత, సాంస్కృతిక వైభవం కలిసిన ఈ పండుగను వెయ్యి ఏళ్ల చరిత్ర ఉన్నట్లు ఇతిహాసాల వల్ల తెలుస్తుంది. బతుకమ్మ పండుగ తెలంగాణకు అస్తిత్వ చిహ్నంగా మారింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పండుగ మరింత ప్రాచుర్యం సంతరించుకొని రాష్ట్ర పండుగగా అధికారిక గుర్తింపును పొందింది ఒకప్పుడు గ్రామీణ ప్రాంత మహిళలతో ప్రారంభమైన ఈ వేడుక ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ ప్రజలు ఉన్న ప్రతి చోటా ఘనంగా నిర్వహించుకోవడం విశేషం. ప్రతి ఏడాది మహాలయ అమావాస్య రోజు నుంచి ప్రారంభమై 9 రోజుల పాటు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకుంటారు. ఈ 9 రోజులలో రోజుకో రూపంలో బతుకమ్మను పేర్చి ఆరాధిస్తారు. తొమ్మిది రోజులపాటు నిర్వహించే బతుకమ్మ ఉత్సవాల్లోని విశిష్టత

#### బతుకమ్మ పేర్చే విధానం

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పళ్ళెంలో తంగేడు, గునుగు, ఇతరత్రా పూలతో పాటు వలయాకారంగా పేర్చుకుంటూ వస్తారు. ఒక రంగు పువ్వు తర్వాత మరో రంగు పువ్వును పేరుస్తు ఆకర్షణీయంగా వుండే విధంగా బతుకమ్మని తయారు చేస్తారు. పూల అమరిక ఎంత అందంగా వుంటే బతుకమ్మ అంత ఆకర్షణీయంగా రూపొందుతుంది. బతుకమ్మను పేర్చడం పూర్తయిన తరువాత, పసుపుతో చేసిన గౌరీమాతను బతుకమ్మపై పెట్టి దీపాలతో అలంకరిస్తారు. ఇలా తయారు చేసిన బతుకమ్మను ఇంట్లోని పూజా గదిలో ఉంచి భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఆ తర్వాత బతుకమ్మని బయటకి తీసుకువచ్చి ఇంటి ముందు ప్రత్యేకంగా అలంకరించిన స్థలంలో ఉంచి గౌరి దేవిని కీర్తిస్తు ఆడుతు పాడుతు సందడి చేస్తారు. అనంతరం వాటిని చెరువులో నిమజ్జనం చేసి ఒకరికొకరు వాయినాలను ఇచ్చి పుచ్చుకుంటారు.

#### మొదటి రోజు :
#### ఎంగిలి పూల బతుకమ్మ

బతుకమ్మ పండుగ వేడుకలు తొలి రోజు మహాలయ అమావాస్య రోజు నుంచి మొదలవుతాయి. తెలంగాణలో దీనినే పెత్తరమాస అని కూడా పిలుస్తారు. ఈరోజున బతుకమ్మను పేర్చడానికి వినియోగించే పూలను ముందు రోజే తెంపుకొచ్చి వాడిపోకుండా నీళ్లలో వేసి మరుసటి రోజు బతుకమ్మగా పేరుస్తారు. అందుకే ఎంగిలిపువ్వు బతుకమ్మగా పిలుస్తారు. మొదటి రోజు తమ పూర్వీకులకు నైవేద్యం సమర్పించిన తరువాత బతుకమ్మను పేరుస్తారు. ఆ రోజున వాయనంగా తమలపాకులు, తులసి ఆకులు ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ ఎంగిలి పూల బతుకమ్మ రోజు బియ్యంతో కలిపి నువ్వులు, బియ్యం పిండి నైవేద్యంగా బతుకమ్మకు నివేదిస్తారు.

#### రెండవ రోజు
#### అటుకుల బతుకమ్మ

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి రోజు అటుకుల బతుకమ్మగా వేడుకలు జరుపుకుంటారు. తంగేడు పూలు, గునుగు పూలు, బంతి, చామంతి, అడవి గడ్డి పూలతో బతుకమ్మను పేరుస్తారు. ఈ అటుకుల బతుకమ్మ పండుగ రోజు సప్పడి పప్పు, బెల్లం, అటుకులు నైవేద్యంగా సమర్పిస్తారు.

#### మూడవ రోజు
#### ముద్దపప్పు బతుకమ్మ

ఆశ్వయుజ మాసం మూడో రోజు ఈ వేడుక జరుగుతుంది. ఈ రోజున చామంతి పూలు, మందార పూలు, సీతమ్మ జడ, రామబాణం పూలతో బతుకమ్మను పేర్చి అందంగా అలంకరిస్తారు. బతుకమ్మ శిఖరంపైన గౌరమ్మను ఉంచి ఉదయం పూజలు చేసి సాయంత్రం గుడి దగ్గర లేదా రోడ్ల కూడలిలో సామూహికంగా అందరు కలిసి ఆడి పాడి బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేస్తారు. ఈ ముద్దపప్పు బతుకమ్మ రోజున ముద్దపప్పు, పాలు, బెల్లంతో కలిపి బతుకమ్మకు నైవేద్యంగా సమర్పిస్తారు.

#### నాల్గవ రోజు
#### నాన బియ్యం బతుకమ్మ

ఆశ్వయుజ మాసంలోని 4వ రోజు తంగేడు పూలు, గునుగు పూలతో బతుకమ్మను పేర్చి శిఖరంపైన గౌరమ్మను ఉంచి నాన బెట్టిన బియ్యం, పాలు, బెల్లం కలిపి బతుకమ్మకు నైవేద్యంగా నివేదిస్తారు.

#### ఐదవ రోజు
#### అట్ల బతుకమ్మ

ఆశ్వయుజ మాసంలో 5వ రోజు అట్ల బతుకమ్మగా జరుపుకుంటారు. ఈ రోజు తంగేడు పూలు, గునుగు పూలు, చామంతి, మందార, గుమ్మడి పూలను అయిదంతరాలుగా పేర్చి బతుకమ్మను తయారు చేస్తారు. ఈ బతుకమ్మకు గోధుమ అట్లు లేదా బియ్యం పిండెతో చేసిన దోశలు నైవేద్యంగా సమర్పిస్తారు.

#### ఆరవ రోజు
#### అలిగిన బతుకమ్మ

బతుకమ్మ పండుగలో ఆరో రోజైన ఆశ్వయుజ పంచమి నాడు బతుకమ్మను అలిగిన బతుకమ్మగా ఆరాధిస్తారు. అంటే ఈరోజు బతుకమ్మ అలకవోతుంది. ఈ రోజున గౌరీదేవి బాధపడ్డారని భక్తులు నమ్ముతారు. ఈ రోజున అమ్మవారు అలిగి ఏమి తినరని భక్తుల విస్వాసం. అందుకే నైవేద్యం సమర్పించరు.

#### ఏడవ రోజు
#### వేపకాయల బతుకమ్మ

ఇది ఆశ్వయుజ మాసంలో 7వ రోజు. ఈ రోజున వేపకాయల బతుకమ్మను పేరుస్తారు. ఈ బతుకమ్మను తంగేడు పూలు, గునుగు పూలు, చామంతి పూలు, గులాబి పూలతో ఏడంతారాలుగా పేర్చి ఆడి పాడి చెరువులో నిమజ్జనం చేస్తారు. ఈ రోజున బతుకమ్మకు బియ్యం పిండిని బాగా వేయించి వేప పండ్ల ఆకారంలో తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

#### ఎనిమిదవ రోజు
#### వెన్నముద్దల బతుకమ్మ

ఆశ్వయుజ మాసంలో 8వ రోజున తంగేడు పూలు, గునుగు పూలు, చామంతి పూలు, గులాబీ పూలు, గడ్డి పూలు, మొదలైన పువ్వులతో బతుకమ్మను పేరుస్తారు. ఈ బతుకమ్మకు నువ్వులు, వెన్న, నెయ్యి బెల్లం కలిపి తయారు చేసిన పదార్థాలను నివేదిస్తారు

#### 9వ రోజు సద్దుల బతుకమ్మ
#### బతుకమ్మ పండుగలో

#### చివరిరోజు.
#### సద్దుల బతుకమ్మ

బతుకమ్మ పండగకు ముగింపు రోజు అయిన సద్దుల బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరుపుకుంటారు. తంగేడు బంతి చామంతి, వంటి రకరకాల పూలతో అత్యంత ఆకర్షణీయంగా పేర్చిన బతుకమ్మలను ఇంట్లోని పూజుగదిలో దేవుని ముందు ఉంచి పసుపుతో తయారుచేసిన గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజింస్తారు. అనంతరం గౌరమ్మను బతుకమ్మపై ఉంచి సమూహంగా అందరు కలిసి గౌరీ దేవిని స్తుతిస్తు ఆడి పాడి బతుకమ్మలను చెర్వుల్లో నిమజ్జనం చేసి గౌరమ్మను చేసిన పసుపును చెంపలకు రాసుకుంటారు. ఇది చివరి రోజు కాబట్టి పిల్లలు, మహిళలు అందరు కలసి చీకటి పడే వరకు బతుకమ్మ ఆడతారు. సద్దుల బతుకమ్మ వేడుకలు ఆశ్వయుజ మాసంలో అష్టమి రోజున దుర్గాష్టమి మహా పర్వదినం నాడు జరుపుకోవడం అనాదిగా సంప్రధాయం. ఈ రోజున బతుకమ్మకు 5 రకాల నైవేద్యాలు నివేదిస్తారు. వీటిలో పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ పూలిహోర, కొబ్బరి అన్నం, నువ్వుల సద్ది వంటివి ఐదు రకాల నైవేద్యాలను బతుకమ్మ అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. ఐక్యత, ప్రేమకు చిహ్నమైన బతుకమ్మ వేడుకలు, పాటలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉంటాయి.

#### పూల పండుగతో ఆరోగ్యం

పూల పండుగలో వయోభేదాలు లేకుండా చిన్నారులు, యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొంటారు.ఈ వేడుకల్లో భాగంగా అందంగా అలంకరించిన బతుకమ్మలు, గౌరమ్మను నియమనిష్ఠలతో పూజిస్తారు. బతుకమ్మలో పేర్చిన వివిధ రకాల పూల సువాసన, వాటి స్పర్శలతో మహిళా సంబంధిత రుగ్మతలు దూరమవడమే కాకుండా ఉత్సాహంగా ఉత్తేజాన్ని ఇస్తాయని ఆయుర్వేద వైద్యులు, వృక్షశాస్త్ర నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో ఆరోగ్యం దాగి ఉందని శాస్త్రీయంగా రుజువైనట్లు పలు అధ్యయనాల నివేదికల వల్ల తెలుస్తుంది.

#### బతుకమ్మకు ఉపయోగించే పూలు వాటి ప్రత్యేకత



**తంగేడు :**
దీనికి సంబంధించిన పువ్వులు, ఆకుల రసం శరీరంలోని చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది. ముఖ్యంగా మహిళల్లో నెలసరి సమస్యకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. దీని ఆకులు, పువ్వుల పొడి చర్మ వ్యాధులను తగ్గించేందుకు దోహదపడుతుంది.

**కాకర పూలు :**

మధుమేహ (షుగర్) వ్యాధిగ్రస్థులకు ఇదొక దివ్య ఔషధం. ప్రతి యాంటిబయోటిక్స్ మందుల తయారీలో కాకర పూల తైలాన్ని వినియోగిస్తారు. ఇది శరీరంలోని చెడు కొవ్వును తగ్గిస్తుంది. శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది.
**గుమ్మడి :** ఇది గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. గుమ్మడి పువ్వులలో కాల్షియం, భాస్వరం, విటమిన్లలను కలిగి ఉంటుంది. ఇవి రోగనిరోధక శక్తి పెంచడంలో సహాయపడతాయి. సూప్?లు, సలాడ్?లు వంటి వంటకాల్లో రంగులను జోడించడానికి ఈ పువ్వులను వినియోగిస్తారు.
**గునుగు :** ఇది కూడా మధుమేహాన్ని నియంత్రించేందుకు దోహదపడుతుంది. ముక్కు నుంచి రక్త స్రావం తగ్గించడానికి ఆయుర్వేద వైద్యంలో దీనిని వినియోగిస్తారు. నోటిలో పుండ్లు ఏర్పడినప్పుడు గునుగు పూలను వాడతారు.
**చామంతి :** చామంతి పూలతో 'టీ' చేసి రాత్రి వేళ తీసుకోవడంతో జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. రాత్రి మంచి నిద్ర కూడా పడుతుంది. ఈ పూల స్పర్శ మానసిక ప్రశాంతతను అందిస్తుంది.
**బంతిపూలు :** ఈ బంతిపూల తైలం రక్త స్రావాన్ని నియంత్రించే మందుగా ఆయుర్వేద వైద్యంలో ఉపయోగిస్తారు. కడుపులోని నులి పురుగుల వ్యాధి నివారణకు వీటిని వాడతారు.
శరద్రుతువులో బంతి, చామంతి, బీర, కాకర, గుమ్మడి, తామర, సీత జడలు, దోస, వామ, తంగేడు, గునుగు, స్వస్తీకం, మందార, అల్లి, కట్ల తదితర పూలు వికసిస్తాయి. వాటితో బతుకమ్మను అందంగా పేర్చుతారు.



**బతుకమ్మ పండుగ శుభాకాంక్షలతో**
**రవికుమార్ సంతోజు**
**బడంగ్‌పేట్, హైదరాబాద్**

# బీసీలకు 34 శాతానికి పైగా టికెట్లు

### స్థానిక ఎన్నికల్లో సముచిత ప్రాధాన్యం

### రిజర్వేషన్ల అమలుకు కట్టుబడి ఉన్నాం

### దర్శి టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్

### గొట్టిపాటి లక్ష్మి

దర్శి(ప్రశ్న న్యూస్) బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని దర్శి టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. న్యాయపరమైన అడ్డంకులు ఎదురైనా బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించే ప్రయత్నాలను కొనసాగిస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున 34 శాతానికి పైగా టికెట్లు కేటాయించే దిశగా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

#### బీసీలకు రాజకీయ అవకాశాలు

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో టీడీపీకి ప్రత్యేక చరిత్ర ఉందని గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఎన్టీఆర్ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించగా, అనంతరం వాటిని 34 శాతానికి పెంచినట్లు తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలోనూ బీసీల సంక్షేమం, సాధికారతకు ప్రాధాన్యం కొనసాగుతోందన్నారు. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక సందర్భంగా బీసీ నాయకులు, కార్యకర్తలకు తగిన అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

#### వైసీపీపై విమర్శలు

బీసీలకు రాజకీయంగా బలమైన ప్రాతినిధ్యం కల్పించడంలో వైసీపీ విఫలమైందని గొట్టిపాటి లక్ష్మి విమర్శించారు. బీసీల సంక్షేమం పేరుతో ప్రకటనలు చేయడం కాకుండా, వారికి నాయకత్వ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల రాజకీయ ఎదుగుదలకు అడ్డంకులు సృష్టించిందంటూ వైసీపీపై ఆరోపణలు చేశారు.

#### పార్టీ పరంగా ప్రాతినిధ్యానికి హామీ

న్యాయస్థానాల నిర్ణయాలను గౌరవిస్తూనే బీసీలకు రాజకీయంగా న్యాయం చేసేందుకు అందుబాటులో ఉన్న మార్గాలను అనుసరిస్తామని గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. రిజర్వేషన్ల అమలులో



ఎదురైన న్యాయపరమైన పరిణామాల నేపథ్యంలోనూ, పార్టీ పరంగా 34 శాతానికి పైగా టికెట్లు కేటాయించే విషయంలో వెనుకడుగు వేయబోమని స్పష్టం చేశారు. బీసీల రాజకీయ సాధికారతకు టీడీపీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

# విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలి

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- వైద్య కళాశాల, వసతి గృహాల పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్**



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) వైద్య కళాశాల భవన నిర్మాణ పనులతోపాటు బాలుర, బాలికల హాస్టళ్లు, మెస్ తదితర నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల, బాలుర, బాలికల వసతి గృహాలు, తదితర నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం సాయంత్రం సంబంధిత అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు చేపట్టిన నిర్మాణాల పురోగతిని, ఇంకా చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ ఆరా తీశారు. బాలికల వసతి గృహం పనులు పూర్తయ్యాయని, కాంపౌండ్ వాల్ కూడా నిర్మించడం జరిగిందని, బాలుర వసతి గృహం త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ భవనాలు త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కళాశాల భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని, పనుల పురోగతిని అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పరిశీలనలో ఆర్ అండ్ బీ ఈఈ బీమ్లా నాయక్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్ కుమార్, తదితరులు ఉన్నారు.

# దసరా సెలవులకు ఊరెళ్తున్నారా.? జాగ్రత్త

**మీ ఇల్లు దొంగల టార్గెట్ కాకూడదు**

**ఇంట్లో బంగారం, డబ్బులు పెట్టకూడదు**

**సీసీ పర్యవేక్షన్లో ఉండాలి**

**పక్కింటి వాటికీ నమ్మకమైన వాళ్లకు తెలియజేయ్యాలి**

**ఏదైనా సంఘటన జరిగినప్పుడు 112కి కాల్ చేసి పోలీస్ లకు సమాచారం ఇవ్వాలి**

**ఇంటికి తాళం వేసి వెళ్లే ముందు అప్రమత్తత అవసరం.. బంగారం, నగదు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.. సీసీ కెమెరాలతో నిఘా.. ఇరుగుపొరుగు సహకారంతో చోరీలకు చెక్ పెటోచ్చు**





మేడ్చల్ (ప్రశ్న న్యూస్) పాఠశాలలకు దసరా సెలవులు ప్రారంభం కావడంతో చాలామంది కుటుంబాలు స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. అయితే సెలవుల సరదాలో పడి ఇంటి భద్రతను నిర్లక్ష్యం చేస్తే దొంగతనాలకు అవకాశం కల్పించినట్లే అవుతుంది. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే విలువైన వస్తువులను కాపాడుకోవడంతో పాటు అనవసరమైన ఆందోళనను నివారించవచ్చు.

## ఇంట్లో బంగారం, నగదు ఉంచి వెళ్లొద్దు!

సెలవుల కోసం రోజుల తరబడి ఇంటికి దూరంగా ఉండాల్సి వస్తే బంగారు ఆభరణాలు, అధిక మొత్తంలో నగదు, విలువైన వస్తువులను ఇంట్లోనే ఉంచి వెళ్లకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలి. సాధ్యమైనంతవరకు బంగారాన్ని బ్యాంకు లాకర్‌లో లేదా సురక్షితమైన ఏర్పాటులో ఉంచుకోవడం మంచిది. ఇంట్లో నగదు, ఆభరణాలు ఉన్న విషయాన్ని ఇతరులకు తెలియకుండా జాగ్రత్త పడాలి. తలుపులకు నాణ్యమైన తాళాలు వేయడంతో పాటు కిటికీలు, వెనుక ద్వారాలు సరిగా మూసి ఉన్నాయో లేదో తనిఖీ చేయాలి.

## ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వాలి

ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్తున్నప్పుడు నమ్మకమైన పక్కింటివారికి సమాచారం ఇవ్వడం మంచిది. ఇంటి పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, తలుపుల వద్ద అనుమానాస్పద కదలికలు ఉన్నా వెంటనే అప్రమత్తం చేయాలని చెప్పాలి. అయితే ఇంట్లో విలువైన వస్తువులు ఉన్నాయనే విషయాన్ని అనవసరంగా పలువురితో పంచుకోకూడదు. పరస్పర సహకారంతో కాలనీలో భద్రతను పెంచుకోవచ్చు.

## సీసీ కెమెరాలతో నిరంతర నిఘా

ఇళ్ల వద్ద, అపార్ట్‌మెంట్ల ప్రవేశ ద్వారాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికే కెమెరాలు ఉన్నవారు అవి సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలి. అవసరమైతే ఇంటి ప్రధాన ద్వారం, ప్రవేశ మార్గాలు స్పష్టంగా కనిపించేలా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. కెమెరాల రికార్డింగ్ సదుపాయం, విద్యుత్ సరఫరా, మొబైల్‌లో పర్యవేక్షణ వంటి అంశాలను ముందుగానే తనిఖీ చేసుకోవాలి. అయితే సీసీ కెమెరాలు ఉన్నంత మాత్రాన పూర్తి భద్రత ఉంటుందని భావించకుండా ఇతర జాగ్రత్తలు కూడా పాటించాలి.

## సోషల్ మీడియాలో వివరాలు వెల్లడించొద్దు

కుటుంబమంతా ఊరికి వెళ్తున్నామని, ఇల్లు ఖాళీగా ఉందని సోషల్ మీడియాలో బహిరంగంగా పోస్టులు పెట్టడం మంచిది కాదు. ప్రయాణ వివరాలు, ఇంట్లో ఎవరూ లేరనే సమాచారాన్ని అపరిచితులకు చేరకుండా జాగ్రత్త పడాలి. ఇంటి తాళం చెవులను ఇంటి బయట దాచిపెట్టడం, తలుపుల వద్ద పత్రాలు పేరుకుపోయేలా వదిలేయడం వంటి పనులకు దూరంగా ఉండాలి.

## అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం

ఇంటివద్ద అనుమానాస్పద వ్యక్తులు సంచరించడం, తాళాలు పగులగొట్టే ప్రయత్నాలు కనిపించడం వంటి ఘటనలు గమనిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. అనుమానితులను స్వయంగా ఎదుర్కొనే ప్రయత్నం చేయకుండా, వారి కదలికలను సురక్షితంగా గమనించి పోలీసులకు వివరాలు తెలియజేయాలి.

## చిన్న జాగ్రత్త.. పెద్ద నష్టం నివారణ!

దసరా సెలవులు కుటుంబాలతో ఆనందంగా గడపాల్సిన సమయం. అయితే ఇంటి భద్రతపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఇంటికి తాళం వేయడం ఒక్కటే సరిపోదు.. విలువైన వస్తువులను సురక్షితంగా ఉంచడం, నమ్మకమైన ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వడం, సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేసుకోవడం, అనుమానాస్పద కదలికలను పోలీసుల దృష్టికి తీసుకెళ్లడం అవసరం.

# 33 గుంటల భూమికి ఎసరు.. ప్రాణభయంతో బాధితులు




శామీర్ పేట (ప్రశ్న న్యూస్ ) మా 33 గుంటల భూమిపై రాజకీయ నాయకులు కన్ను పడిందని తమకు ప్రాణహాని ఉందంటూ భూ బాధితులు జకముకల హనుమంతరెడ్డి, జకముకల వీరారెడ్డిలు ఆరోపించారు. శుక్రవారం ఉమ్మడి శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జగన్‌గూడ రెవెన్యూ పరిధిలో 33 గుంటల భూమిని 1996లో కొనుగోలు చేశామని తెలిపారు. 1927 నాటి సర్వే రికార్డులతో పాటు పాత ఇంటి పన్ను, విద్యుత్ బిల్లు, మోటారు రుణానికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు. తమకు అనుకూలంగా కోర్టు ఆదేశాలు వచ్చినప్పటికీ వేధింపులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫెన్సింగ్ కోసం తెచ్చిన రాళ్లు, కడీలను రాత్రికి రాత్రే బావిలో పడేసి, బావిని సైతం పూడ్చివేశారని ఆరోపించారు. గుంపులుగా వచ్చి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, తమకు ప్రాణహాని ఉందని వాపోయారు. కోర్టు ఆదేశాలు, భూ ఆధారాలు ఉన్నా తమకు రక్షణ కరువైందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణ యత్నాలపై విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమ భూమిని, ప్రాణాలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

# బీజేపి ఎంఎల్‌సీ అభ్యర్థి పి. వెంకటేష్ కు అవకాశం

**రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య హామీ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మహబుబ్‌నగర్ రంగారెడ్డి హైదరాబాద్ ఎంఎల్‌సీ స్థానానికి జరగనున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బీసీ నేతకు అవకాశం కల్పించాలని బీజేపి బీసీ ఎన్‌ఆర్ఐ నేషనల్ కన్వీనర్ పి. వెంకటేష్ కోరారు. శుక్రవారం నాడు పి. వెంకటేష్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘం నాయకులు నీలం వెంకటేష్, అనంతయ్యతో కలిసి రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి, మహబుబ్‌నగర్ రంగారెడ్డి హైదరాబాద్ ఎంఎల్‌సీ స్థానంలో బీజేపి అభ్యర్థిగా బీసీనైన తనకు అవకాశం కల్పించేందుకు సహకరించాలని కోరారు.

ఈ సందర్భంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడుతు పి. వెంకటేష్ విద్యార్థి దశ నుండే పలు బీసీ ఉద్యమాలలో తనతో పాటు కలిసి పనిచేసినట్లు చెప్పారు. మహబుబ్‌నగర్ రంగారెడ్డి హైదరాబాద్ ఎంఎల్‌సీ బీజేపీ అభ్యర్థిగా పి. వెంకటేష్ కు అవకాశం కల్పించటంలో తన పూర్తి సహకారం, మద్దతు ఉంటుందని హామీ ఇచ్చినట్లు పి. వెంకటేష్ తెలిపారు.

# సేవా కార్యక్రమాల మధ్య ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**ఆరు మండలాల్లో సంబరాలు.. విద్యార్థులకు పుస్తకాలు, పాఠశాలకు రూ.10 వేల సాయం**

**శ్రీశైలంలో ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేక పూజలు**





గిద్దలూరు(ప్రశ్న న్యూస్) గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, అర్ధవీడు, బెస్తవారిపేట, కంభం మండల కేంద్రాలతోపాటు పలు గ్రామాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అన్నదానం, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయం వంటి కార్యక్రమాలు చేపట్టారు.

## శ్రీశైలంలో ప్రత్యేక పూజలు

జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం చేరుకుని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజల ఆయురారోగ్యాలు, నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రార్థించారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కంభం మండలం తురిమెళ్లలో నిర్వహించిన వేడుకల్లో ముత్తుముల క్రిష్ణ కిషోర్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షల పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. గిద్దలూరు క్లబ్ రోడ్డులో అభిమానులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. కంభంలోనూ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో అనుసంధానిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకారం అందించడం, అన్నదానం నిర్వహించడం విశేషంగా నిలిచింది.

# బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి రూ.39 లక్షల పరికరాలు

**వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా అందజేత**

**నెలకు 30 నుంచి 46కు పెరిగిన ప్రసవాలు**



బుచ్చిరెడ్డిపాళెం(ప్రశ్న న్యూస్) స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కు రూ.39 లక్షల విలువైన వైద్య పరికరాలు, ఫర్నీచర్ అందజేశారు. ఐఆర్‌ఈడీఏ సంస్థ సీఎస్ఆర్ నిధులతో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా వీటిని సమకూర్చారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొని పరికరాలను అందుబాటులోకి తెచ్చారు.

## మెరుగైన వైద్య సేవలకు తోడ్పాటు

ఆసుపత్రిలో గతంలో పరికరాలు, అవసరమైన సామగ్రి కొరతను గుర్తించి వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గర్భిణులకు ప్రతి నెలా 9వ తేదీన నిర్వహించే ఏఎన్‌సీ పరీక్షలతో పాటు థైరాయిడ్ పరీక్షలకు అవసరమైన పరికరాలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయన్నారు. సహకరించిన ఐఆర్‌ఈడీఏకు కృతజ్ఞతలు తెలిపారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం, థైరాయిడ్ పరీక్షల యంత్రంతో పాటు ఈసీజీ యంత్రాలు, డెలివరీ టేబుల్, పేషెంట్ బెడ్లు, ఫొటోథెరపీ యూనిట్లు, వీల్‌చైర్లు తదితర వైద్య పరికరాలను అందించారు. కార్యాలయ కుర్చీలు, కంప్యూటర్ టేబుళ్లు, రిఫ్రిజిరేటర్లు, ప్రింటర్లు, మందుల నిల్వ ర్యాక్‌లు, బాక్సులను కూడా సమకూర్చారు.

## వైద్యుల సేవలు అభినందనీయం

వైద్యులను ప్రజలు దైవ స్వరూపంగా భావిస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గతంలో నెలకు సుమారు 30 ప్రసవాలు జరిగే సీహెచ్‌సీలో ప్రస్తుతం ఆ సంఖ్య 46కు పెరగడం అభినందనీయమన్నారు. వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలకు ఇది నిదర్శనమని తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన పరికరాలను సద్వినియోగం చేసుకుంటూ, అంకితభావంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంతో బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీలో వైద్య పరీక్షలు, ప్రసూతి సేవలకు అవసరమైన సదుపాయాలు మరింత మెరుగుపడనున్నాయి.

# 'హనుమాన్ అంశ్' - మూవీ రివ్యూ!



ఎలాంటి స్టార్స్ లేకుండా .. భారీ యాక్షన్ సీక్వెన్స్ లు .. సాంగ్స్ లేకుండా ఒక సినిమా వందల కోట్లను రాబట్టడం అంత తేలికైన విషయమేమీ కాదు. 200 కోట్లు ఖర్చు చేస్తే 400 కోట్లు రాబట్టడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ ఒక సినిమా కేవలం 2 కోట్ల రూపాయలతో నిర్మిస్తే అది 425 కోట్లకి పైగా వసూళ్లను సాధించడం విశేషంగానే చెప్పుకోవాలి. అలాంటి ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్న సినిమానే 'హనుమాన్ అంశ్'. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు 'నీమ్ కరోలీ బాబా' జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ సినిమా, ఆగస్టు 7వ తేదీన విడుదలైంది. ఈ రోజున తెలుగులోను థియేటర్లకు వచ్చింది. లక్ష్మీ నారాయణ శర్మ (శోభినవ్ సత్య) చిన్నతనంలోనే తల్లిని కోల్పోతాడు. తండ్రి మరో వివాహం చేసుకోవడాన్ని అతను జీర్ణించుకోలేకపోతాడు. తన వయసు పిల్లలతో ఆడుకోకుండా ధ్యానంలోనే ఎక్కువ సమయాన్ని గడుపుతూ ఉండేవాడు. ఆధ్యాత్మిక జీవితం పట్ల ఆయనకి గల ఆసక్తి, ఆ ఊరును .. ఆ ఇంటిని వదిలి వెళ్లేలా చేస్తుంది. తన ఇష్టదైవమైన శ్రీరాముడిని దర్శించాలంటే ముందుగా హనుమను ఆరాధించాలనే మాట ఆయనలో నాటుకుపోతుంది. అప్పటి నుంచి ఆయన హనుమను ఆరాధిస్తూ ఉంటాడు. అనేక క్షేత్రాలలో పర్యటిస్తూ .. ఆధ్యాత్మిక పరంగా ఎంతోమందిని ప్రభావితం చేస్తూ లక్ష్మీనారాయణ శర్మ ముందుకు వెళుతూ ఉంటాడు. చిన్నప్పటి నుంచే పశువులు .. పక్షుల భాషలు అర్థం చేసుకుంటూ ఆయన మహిమలు చేస్తూ వెళ్లిన తీరు అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. పక్షులు పట్టే ఒక వేటగాడు ముందుగా ఆయనలోని దైవత్వాన్ని గుర్తిస్తాడు. అప్పటి నుంచి ప్రధానమైన శిష్యుడిగా .. అనుచరుడిగా అతను పక్కనే ఉంటూ ఉంటాడు. గుహాలో అనేక సర్పాల మధ్య ధ్యానం చేసుకుంటున్న బాబాను అతను చూడటం వల్లనే తొలిసారిగా బాబాను గురించి ఎక్కువమందికి తెలుస్తుంది. ఒకసారి ఆంగ్లేయులు ప్రయాణిస్తున్న ట్రైన్ లో .. ఫస్టు క్లాస్ బోగీలోకి బాబా ఎక్కుతాడు. అందులోని అధికారులు బాబాను దింపేయమని టీసీని ఒత్తిడి చేస్తారు. దాంతో అతను ట్రైన్ చైన్ లాగేసి మరీ బాబాను దింపేస్తాడు. అంతే ఇక అక్కడి నుంచి ట్రైన్ కదలదు. ఎంతమంది ఇంజనీర్లు వచ్చినా .. మరో ఇంజన్ ను తెప్పించినా ట్రైన్ మాత్రం కదలదు. క్షమించమని ఆ బ్రిటీష్ అధికారి కోరిన తరువాతనే ట్రైన్ కదులుతుంది. ఈ సంఘటన జరిగింది 'నీమ్ కరోలి' విలేజ్ దగ్గర కావడంతో, ఆ మహిమను గుర్తు చేసుకుంటూ ఆయనను 'నీమ్ కరోలీ బాబా'గా పిలవడం మొదలైంది. ఇలా ఆయన ప్రయాణంలో కనిపించే మహిమలతో ఈ కథ ఆసక్తికరంగా సాగుతుంది. భారతదేశ ఆధ్యాత్మిక వైభవంలో ఎంతోమంది సిద్ధపురుషులు .. యోగులు .. అవధూతలు .. సద్గురువులు ప్రధానమైన పాత్రను పోషించారు. అలాంటి ఆధ్యాత్మిక గురువుల గురించిన సినిమాలు కొన్ని తెరకెక్కాయి. అలా రూపొందిన సినిమానే 'హనుమాన్ అంశ్'. బాబా బాల్యం .. ఆయన కొనసాగించిన ఆధ్యాత్మిక ప్రయాణం .. ఆయన మహిమలు బహిర్గతం కావడం వరకూ ఫస్టాఫ్ గా ప్రేక్షకుల ముందుకు వస్తుంది. బాబా వైవాహిక జీవితం .. ఆయన చేసిన మరికొన్ని మహిమలతో సెకండాఫ్ కొనసాగుతుంది.సాధారణంగా ఈ తరహా కథలను తెరకెక్కించేటప్పుడు, మహిమలకు సంబంధించిన సన్నివేశాలను గ్రాఫిక్స్ .. సౌండ్ ఎఫెక్ట్స్ తో నెక్స్ట్ లెవెల్ కి తీసుకుని వెళుతుంటారు .. పూనకాలు తెప్పిస్తుంటారు. కానీ దర్శకుడు అలాంటి విషయాల వైపు వెళ్లకుండా చాలా సహజంగా ఈ కథను నడిపిస్తూ వెళ్లాడు. బాబా మహిమలను ఒకదాని తరువాత ఒకటిగా చూపించినట్టుగా కాకుండా, కథలో భాగంగా అవి ఆవిష్కృతమయ్యేలా తీసుకున్న జాగ్రత్తలు ఆకట్టుకుంటాయి. అయితే కాస్తంత అసంతృప్తిని కలిగించే అంశాలు కూడా లేకపోలేదు. చిన్న చిన్న మహిమలను ఎంత సహజంగా చూపించారో, మరింత విస్మయానికి గురిచేసేలా అనిపించే మహిమలను కూడా అంతే సింపుల్ గా తేల్చేశారేమో అనిపిస్తుంది. గుహాలో .. సర్పాల మధ్యలో బాబా ధ్యానం చేసుకునే సీన్ .. ట్రైన్ ను కదలకుండా చేసే సీన్ అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అయితే బడ్జెట్ ను దృష్టిలో పెట్టుకుంటే ఇవేమీ అసంతృప్తిని కలిగించవు. సహజత్వానికి దర్శకుడు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చాడనుకుంటే సరిపెట్టేసుకోవచ్చు. కాకపోతే అక్కడక్కడా సన్నివేశాలను సాగదీసినట్టు మాత్రం అనిపిస్తుంది. లక్ష్మీనారాయణ శర్మ ఆధ్యాత్మిక ప్రయాణం ఎలా మొదలైంది. ఏయే ప్రాంతాల మీదుగా ఆయన ప్రయాణం సాగింది .. ఆయన మజిలీ చేసిన ప్రదేశాలు .. అక్కడ చూపిన మహిమలను దర్శకుడు పూర్తి అవగాహనతో .. చాలా స్పష్టంగా ఆవిష్కరిస్తూ వచ్చాడు. ఆయన 'నీమ్ కరోలీ బాబా'గా మారిన వైనాన్ని ఆవిష్కరించిన తీరు ఆసక్తికరంగా అనిపిస్తుంది. బాబా చూపిన మహిమలు ఇంకా అనేక ఉన్నాయి. అవన్నీ కూడా సెకండ్ పార్ట్ లో వస్తాయనే అనుకోవలసి ఉంటుంది. చాలా తక్కువ బడ్జెట్ లో నిర్మించినప్పటికీ క్వాలిటీ విషయంలో .. ఆ కాలం నాటి వాతావరణాన్ని ఆవిష్కరించే విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారనే అనాలి. విశాల్ ఫొటోగ్రఫీ .. సాధు సుశీల్ తివారి నేపథ్య సంగీతం ఆకట్టుకుంటాయి. శంఖ్ రాజాధ్యక్ష ఎడిటింగ్ ఫరవాలేదు. శోభినవ్ సత్య తో పాటు మిగతా పాత్రలను పోషించిన ఆర్టిస్టులంతా చాలా సహజంగా చేశారు. శ్రీరాముడు .. హనుమంతుడు .. ప్రస్తావనలతో నీమ్ కరోలి బాబాకి సంబంధించిన ఈ సినిమా నడుస్తుంది. 'నీమ్ కరోలి బాబా' గురించి తెలిసినవారికీ .. ఆధ్యాత్మిక చింతన ఉన్నవారికి ఈ సినిమా ఎక్కువగా కనెక్ట్ అవుతుందని చెప్పచ్చు.

# ఆ పద్ధతి నాకు నచ్చలేదు

'కథ పాతదే అయినా.. తెరకెక్కించే విధానం కొత్తగా ఉంటే చాలు సక్సెస్ అదే వస్తుంది. అందుకే.. కథ ఎంత ముఖ్యమో, దాన్ని తెరకెక్కించే దర్శకుడి అభిరుచి కూడా అంతే ముఖ్యం' అంటున్నది మలయాళ మందారం అనుపమ పరమేశ్వరన్. సినిమాలను ఎంపిక చేసుకునే విషయంలో తాను ఏ విధమైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటుందో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరంగా తెలిపింది అనుపమ పరమేశ్వరన్. 'ఇటీవల ఓ కథ విన్నాను. చాలా బాగుంది. అయితే.. కథ రైటర్ వినిపించారు. డైరెక్టర్ మాత్రం సైలెంట్‌గా కూర్చొని, నాతోపాటు వింటున్నారు. నాకెందుకో ఆ పద్ధతి నచ్చలేదు. కథ చెప్పాల్సింది దర్శకుడు. దాన్ని తెరకెక్కించాల్సిందీ దర్శకుడే. అలాంటి స్థానంలో ఉండి, అలా సైలెంట్‌గా కూర్చోవడం నాకెందుకో ఇబ్బందిగా అనిపించింది. సినిమా లొకేషన్ ఓ పిక్నిక్‌లా ఉండాలని కోరుకుంటాన్నేను. డైరెక్టర్ సైతం మాతో కలిసిపోవాలి. సరదా సరదాగా షూటింగ్ జరగాలి. అలా అయితే అవుట్‌పుట్ కూడా బావుంటుంది. అందుకే.. యువతరంతో పనిచేసేందుకే నేనెక్కువగా ఇష్టపడతా. అలాగే కొత్తవాళ్లతో ఇంటిమేటెడ్ సీన్స్ అంటే కూడా నేను ఇబ్బందిగా ఫీలవుతా. కథ డిమాండ్ చేసినా, పరిచయం లేనివారితో చనువుగా ఉండే సన్నివేశాలు చేయడం కాస్త కష్టంగా ఉంటుంది. నా వరకూ సినిమా ఓకే చేసే విషయంలో కథతోపాటు దర్శకుడు కూడా నాకు ట్యూన్ అవ్వాలి. అప్పుడే సినిమాను అంగీకరిస్తా. కథ బాగుండి, దర్శకుడు విషయంలో డౌట్ వల్ల వదులుకున్న ప్రాజెక్టులు చాలా ఉన్నాయి' అంటూ గుర్తు చేసుకున్నది అనుపమ పరమేశ్వరన్.



# పెద్దలతోపాటు పిల్లలకూ నచ్చే సినిమా



ఆయన కథానాయకుడిగా రూపొందిన ఎమోషనల్ ఎంటర్‌టైనర్ 'కామ్రేడ్ కళ్యాణ్'. మహిమా నంబియార్ కథానాయిక. జానకిరామ్ మారెళ్ల దర్శకుడు. కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మాతలు. కోన వెంకట్ సమర్పకుడు. ఈ నెల 9న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ప్రెస్‌మీట్‌లో శ్రీవిష్ణు మాట్లాడారు. 'ఈ రోజు మా 'కామ్రేడ్ కల్యాణ్'.. రేపట్నుంచి కామెడీ కళ్యాణ్ అవుతాడు. ఈ సినిమాతో మాది రెండేళ్ల జర్నీ. ఒరిస్సా, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో ఎవరూ తీయని లోకేషన్లలో ఈ సినిమా చిత్రీకరణ జరిపాం. ఎక్కడా రాజీపడలేదు. శ్రీవిష్ణు కెరీర్‌లోనే మోస్ట్ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా నిలిచే సినిమా ఇది' అని సమర్పకుడు కోనవెంకట్ చెప్పారు. ఇంకా దర్శకుడు జానకిరామ్, నిర్మాత వెంకటకృష్ణ కూడా మాట్లాడారు.

## యష్ 'టాక్సిక్'కు మరో షాక్..

### రూ.200 కోట్ల ఓటీటీ డీల్‌పై నీలినీడలు!



కన్నడ రాకింగ్ స్టార్ యష్‌కు 'కేజీఎఫ్' సిరీస్ ఎలాంటి గుర్తింపును తీసుకొచ్చిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సినిమాలతో దేశవ్యాప్తంగా భారీ అభిమానగణాన్ని సంపాదించుకున్న ఆయన.. తదుపరి చిత్రాల విషయంలో ఎంతో జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌తో కలిసి 'టాక్సిక్' అనే భారీ పాన్ ఇండియా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అయితే ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ బిజినెస్‌పై తాజాగా పలు వార్తలు వినిపిస్తున్నాయి. 'టాక్సిక్' సినిమాపై మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. యష్ చాలా కాలం తర్వాత హీరోగా నటిస్తున్న సినిమా కావడంతో అభిమానులు ఈ ప్రాజెక్టుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే సినిమా విడుదలకు ముందే డిజిటల్ హక్కుల విషయంలో భారీ మొత్తంలో బిజినెస్ జరగనుందనే ప్రచారం సాగింది. ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా డిజిటల్ హక్కులను దక్కించుకోనున్నట్లు వార్తలు వచ్చాయి. తొలుత ఈ ఒప్పందం విలువ సుమారు రూ.200 కోట్ల వరకు ఉండొచ్చని ప్రచారం జరిగింది. అయితే తాజా ప్రచారం ప్రకారం, సినిమా హక్కుల కోసం మొదట అనుకున్న స్థాయిలో డిమాండ్ లేదని తెలుస్తోంది. రూ.200 కోట్లుగా వినిపించిన ఓటీటీ డీల్ విలువ రూ.30 కోట్లకు తగ్గినట్లు కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా, ఈ మొత్తం విషయంలోనూ తుది ఒప్పందం కుదిరిందా లేదా అనే దానిపై స్పష్టత లేదు. ఈ వార్తలపై చిత్రబృందం లేదా సంబంధిత ఓటీటీ సంస్థ అధికారిక ప్రకటన చేయలేదు.'కేజీఎఫ్' సినిమాల తర్వాత యష్ తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించడానికి చాలా సమయం తీసుకున్నారు. చివరకు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో 'టాక్సిక్' చిత్రాన్ని ప్రారంభించారు. విభిన్నమైన కథాంశం, భారీ నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు ప్రచారం జరిగింది. దీంతో ఈ సినిమాపై దేశవ్యాప్తంగా సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అయితే సినిమా బాక్సాఫీస్ ఫలితం, ఓటీటీ హక్కుల ఒప్పందం వంటి అంశాలపై వస్తున్న వార్తలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

# 'కామ్రేడ్ కల్యాణ్' మూవీ రివ్యూ



వినోదాత్మక కథాంశాలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నారు కథానాయకుడు శ్రీ విష్ణు. ఆయన సినిమా అంటే ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ అనే నమ్మకం ప్రేక్షకుల్లో ఉంటుంది. ఈ జాబితాలోనే శ్రీ విష్ణు మరో వినోదాత్మక కథాంశంతో నటించిన చిత్రం 'కామ్రేడ్ కల్యాణ్'. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా ఎలా ఉంది? ఈ చిత్రం ప్రేక్షకులకు వినోదాన్ని పంచిందా? లేదా అనేది సమీక్షలో తెలుసుకుందాం. 1992వ సంవత్సరంలో జరిగే కథ ఇది. మాడుగుల అనే ప్రాంతానికి చెందిన కల్యాణ్ (శ్రీ విష్ణు) ఆర్.నారాయాణ మూర్తికి వీరాభిమాని. అరకొర చదువు మాత్రమే చదువుకున్న కల్యాణ్ థియేటర్‌ను లీజుకు తీసుకుని ఆర్.నారాయణ మూర్తి సినిమాలు ప్రదర్శిస్తూ కాలం గడుపుతుంటాడు. ఓసారి అనుకోకుండా ప్రాణపాయ స్థితిలో ఉన్న తన తల్లి (రాధికా శరత్‌కుమార్)ని కేరళ నుంచి వచ్చిన సితార దేవి (మహిమా నంబియార్) కాపాడుతుంది. అప్పటి నుంచే కల్యాణ్ ఆమె ప్రేమలో పడిపోతాడు. ఆమెతో జీవితాన్ని పంచుకోవాలనుకుంటాడు. తన మనసులోని ప్రేమను సితారదేవికి తెలియజేయాలని అనుకుంటున్న తరుణంలోనే ఓ నిజం తెలుస్తుంది. ఆ విషయం తెలుసుకున్న కల్యాణ్ ఎలాగైనా సితారను, ఆమె కుటుంబాన్ని కష్టాల నుంచి బయటపడేయాలని నిర్ణయించుకుంటాడు. అందుకోసం ఎవరూ చేయని, సాహసించని దారిని ఎంచుకుంటాడు. అప్పుడు ఏం జరిగింది? కల్యాణ్ కామ్రేడ్ కల్యాణ్‌గా ఎందుకు మారాల్సి వచ్చింది? ఆ తరువాత జరిగిన పరిణామాలేమిటి? సితార కుటుంబాన్ని కష్టాల నుంచి ఎలా గట్టెక్కించాడు? పోలీస్ ఆఫీసర్ (షైన్ టామ్ చాకో) కు ఈ కథకు సంబంధం ఏమిటి ? అనేది మిగతా కథ ఈ సినిమా ప్రచార చిత్రాల్లో ఉన్నట్లుగా నక్సలైట్స్ దళాలు, పోలీసులు.. ఇలా కనిపించగానే అందరూ ఇదొక సీరియస్ కథ అనుకుంటారు. అయితే ప్రారంభ నేపథ్యం అలాంటి ఆలోచన కలిగించినప్పటికీ ఇది పూర్తి స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్ సినిమా. ఇప్పటి వరకు నక్సల్ నేపథ్యంలో వచ్చిన సీరియస్ సినిమాలకు పూర్తి భిన్నంగా అల్లుకున్న కథ ఇది. ప్రతి సన్నివేశంలో కామెడీ పండించడానికి మాత్రమే ట్రై చేశారు. ఎలాంటి లాజిక్‌లు లేకుండా ఆడియన్స్‌ను నవ్వించడమే ధ్యేయంగా తెరకెక్కించిన సినిమా ఇది. బాలకృష్ణ అభిమానిగా రాధికా శరత్‌కుమార్ చేసే హడావుడి, శ్రీ విష్ణు తన ప్రేమను హీరోయిన్‌కు తెలియజేయడానికి పడే పాట్లతో.. అక్కడక్కడా పండిన కామెడీ సన్నివేశాలతో ఫస్టాఫ్ అంతంత మాత్రంగా ఫర్వాలేదనిపించే స్థాయిలో ఉంటుంది. ఇక సెకండాఫ్‌లో కథను నడిపించడంలోనే అసలు సమస్య ప్రారంభమవుతుంది. అందుకే దర్శకుడు సెకండాఫ్‌ను కూడా పూర్తిస్థాయి కామెడీతో గట్టెక్కించాలనుకున్నాడు. అయితే ఈ ప్రయత్నం ఫలించలేదు. దుబాయ్ బాబుగా సత్య పాత్ర కాసేపు నవ్విస్తుంది. సత్య రాసే ప్రేమలేఖ ఎపిసోడ్ ఓ మోస్తరుగా అలరిస్తుంది. బిశ్వాస్ పాత్రలో ఉపేంద్ర లిమాయే చేసిన కామెడీ వర్కవుట్ కాలేదు. ఈ ట్రాక్ కూడా పండి ఉంటే సినిమా రిజల్ట్‌కు ప్లస్ అయ్యేది. వెన్నెల కిషోర్ కూడా తన పాత్రతో నవ్వులు పూయించే ప్రయత్నం చేసినా అది అంతగా ఆకట్టుకోలేకపోయింది. సెకండాఫ్‌లో వచ్చే కన్‌ఫ్యూజన్ కామెడీ ఇంతకు ముందే చాలా సినిమాల్లో చూసినట్లుగా అనిపించడంతో విసుగు తెప్పిస్తుంది. ఉపేంద్ర లిమాయే పాత్ర ప్రారంభంలో నవ్వించినా రాను రాను ఆ కామెడీ బోరింగ్‌గా మారిపోయింది. కామెడీ సినిమా కాబట్టి ఈ కథాంశంలో ఎలాంటి లాజిక్కులు ఉండవు. 90ల నేపథ్యంలో కొనసాగే కథ అయినా సినిమాటిక్ లిబర్టీతో చాలా సన్నివేశాల్లో ప్రస్తుత సినిమా ప్రస్తావన కూడా తీసుకొచ్చారు. సినిమా ఆద్యంతం గ్రాఫ్‌గా చెప్పుకుంటూ పడుతూ లేస్తూ ఉన్న ఈ కథకు పతాక సన్నివేశాలు కూడా అంతా ఇంపాక్ట్‌గా లేకపోవడం కూడా మైనస్‌గా మారింది.

ఓవరాల్‌గా నవ్వించాలనే ధ్యేయంతో రొటీన్ కామెడీతో రూపొందిన కామ్రేడ్ కల్యాణ్‌లో అక్కడక్కడా నవ్వులు పూసిన రైటింగ్‌లో ఏ మాత్రం కొత్తదనం మాత్రం కనిపించదు. శ్రీవిష్ణుకు ఇలాంటి పాత్రలు చేయడంలో అలవాటుపడటంతో కల్యాణ్ పాత్రలో ఒదిగిపోయాడు. కమెడియన్స్ సుదర్శన్, సత్యతో కలిసి నవ్వించడానికి తన వంతు ప్రయత్నం చేశాడు. మహిమా నంబియార్ పాత్రకు నటనకు పెద్దగా స్కోప్ లేదు. రాధికా శరత్‌కుమార్, సత్య రఘుబాబు, ఉపేంద్ర లిమాయో, వెన్నెల కిశోర్, మురళీధర్ గౌడ్, శ్రీకాంత్ అయ్యంగార్ ఇలా అందరూ తమ పాత్రలకు న్యాయం చేశారు. అడవిలో చిత్రీకరణ, అక్కడి విజువల్స్, కథకు తగ్గ లోకేషన్స్‌ల్లో చిత్రీకరణతో సాయి శ్రీరామ్ కెమెరా వర్క్ ఆకట్టుకుంటుంది. రొటీన్ కథతో... ఏ మాత్రం కొత్తదనం లేకుండా అక్కడక్కడ నవ్వించే కామెడీ సన్నివేశాలతో.. ఎలాంటి లాజిక్‌లు లేకుండా, ప్రేక్షకులకు నవ్వులు పంచాలని చేసిన 'కామ్రేడ్ కల్యాణ్' ప్రయత్నం పూర్తిస్థాయిలో సఫలీకృతం కాలేదు. కామెడీ ఎలా ఉన్నా ఫర్వాలేదు.. మాకు టైమ్ పాస్ అవుతుంది అని భావించే ప్రేక్షకులకు 'కామ్రేడ్ కల్యాణ్' ఓ మోస్తరుగా నచ్చే అవకాశం ఉంది.

## ప్రభాస్ 'ఫౌజీ' కొత్త రిలీజ్ డేట్ ఇదేనా..

### - ఇదే నిజమైతే 'స్పిరిట్'పై ప్రభావం తప్పదా?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న సినిమాలపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయన చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉండగా, వాటిలో పీరియడ్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ' ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించి తాజాగా కొత్త విడుదల తేదీపై ప్రచారం మొదలైంది. తొలుత డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించిన ఈ సినిమాను వాయిదా వేసి, 2027 మార్చి 18న విడుదల చేయాలని చిత్రబృందం ఆలోచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ తేదీపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.'ఫౌజీ' చిత్రీకరణ ప్రస్తుతం కీలక దశలో ఉన్నట్లు సమాచారం. సినిమాలోని భారీ యాక్షన్ సన్నివేశాలను పూర్తి చేయడంపై చిత్రబృందం దృష్టి పెట్టిందని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆలయం నేపథ్యంలో రూపొందించిన ప్రత్యేక సెట్‌లో ఇంటర్వెల్ ఫైట్‌ను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 15 నుంచి క్లైమాక్స్ సన్నివేశాల చిత్రీకరణ ప్రారంభించనున్నారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. డిసెంబర్ మొదటి వారానికల్లా ప్రభాస్‌కు సంబంధించిన ప్రధాన సన్నివేశాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. మిగిలిన యాక్షన్ ఎపిసోడ్ల చిత్రీకరణ కూడా పూర్తయితే, సినిమా తదుపరి నిర్మాణానంతర పనులపై చిత్రబృందం దృష్టి సారించనుంది. అయితే ఈ షెడ్యూల్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.అక్టోబర్ 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా 'ఫౌజీ' నుంచి ప్రత్యేక గ్లింప్స్ లేదా టీజర్‌ను విడుదల చేయనున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ వీడియోతో సినిమా ప్రచారాన్ని మరింత వేగవంతం చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. అయితే పుట్టినరోజు కానుకగా ఏదైనా వీడియోను విడుదల చేస్తారా? చేస్తే అది గ్లింప్సా, టీజరా? అనే విషయాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.ప్రభాస్ కొత్త లుక్, సినిమాలోని పాత్ర స్వభావం, యాక్షన్ సన్నివేశాలకు సంబంధించిన చిన్నపాటి దృశ్యాలు బయటకు వస్తే అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే పుట్టినరోజు అప్‌డేట్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని ప్రచారం జరుగుతోంది. కొన్ని స్టంట్స్‌ను డూప్ లేకుండా ప్రభాస్ స్వయంగా చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

# వరిగుంతం గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి బూతు పురాణం...

**నన్ను అడగడానికి నీవు ఎవడివి.**

**ప్రశ్నించిన దండు ప్రశాంత్ తేజ పై బూతులతో దూషణ..**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండలంలోని వరిగుంతం గ్రామంలో గ్రామసభలో పంచాయతీ నిధుల దుర్వినియోగం అవినీతి అక్రమాలపై ప్రశ్నించిన దండు ప్రశాంత్ తేజ యువకుడి పై పంచాయతీ కార్యదర్శి బూతులు తిడుతూ.. ఎదురుదాడికి దిగిన సంఘటన శుక్రవారం వరిగుంతం గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామసభలో జరిగింది. శుక్రవారం సర్పంచ్ మోహన్ అధ్యక్షతన వరిగుంతం గ్రామపంచాయతీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి నూతన పంచాయతీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నుండి ఇప్పటివరకు గ్రామపంచాయతీకి వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ రక్షిత మంచినీటి మీ సరఫరా చేసే మూడు మోటార్ల స్టార్టర్ల మరమ్మతులకురూ.36 వేల రూపాయలు ఖర్చు చేయడం, పైప్లైన్ లీకేజీలకు రూ.40,000 ఖర్చు చేయడం పది ట్రిప్పుల మట్టి రోడ్డుపై రెండు స్థలాలను వేసి రూ.1,33,000 రూపాయలు ఎంబి రికార్డు చేయడం ద్వారా డ్రా చేయడం పై గ్రామానికి చెందిన యువకులు పంచాయతీ కార్యదర్శి సర్పంచులను నిలదీశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి రూ. రెండు లక్షల ఇరవై వేలు తాను ఖర్చు చేసినట్లు ఎంబిలో రికార్డు చేయగా రూ.మూడు లక్షల అరవై వేల రూపాయలు తన తల్లి సరస్వతి అకౌంట్లోకి ఎలా మళ్ళించారని యువకులు పంచాయతీ కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి తన అవినీతి అక్రమాలప్రశ్నించినదండు ప్రశాంత్ తేజ యువకుడిని బూతులు తిడుతూ నీవు ఎవ్వడిని నన్ను అడగడానికి అంటూ ఎదురు దాడికి దిగారు.దీంతో గ్రామసభ రచ్చ రచ్చగా మారింది. పంచాయతీ పాలకవర్గం 9 నెలల కాలం లో సుమారు రూ.13 లక్షల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయంటూ గ్రామస్తులు ప్రశ్నించడంతో సర్పంచ్ మోహన్, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవితో వాగ్వాదం జరిగింది.గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసిన నిధులకు సంబంధించిన బిల్లులపై అనుమానాలు వ్యక్తం చేస్తూ గ్రామస్తులు నిలదీయడం చర్చనీయాంశంగా మారింది.

**- విచారణతోనే నిజా నిజాలు వెలుగులోకి!**

గ్రామపంచాయతీ నిధుల ఖర్చులపై వస్తున్న ఆరోపణలు స్థానికంగా చర్చకు దారితీశాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది. ఆరోపణల్లో వాస్తవమెంత, నిధుల వినియోగంలో నిబంధనలు పాటించారా లేదా అన్నది సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడటంతో పాటు, ప్రతి రూపాయికి లెక్క చెప్పేలా సంబంధిత యంత్రాంగం చర్యలు చేపట్టాలని వరిగుంతం గ్రామస్తులు కోరుతున్నారు.

# పంటలు ఎండిపోతుంటే పట్టించుకోరా?

**రైతులకు 12 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాల్సిందే!**

**లక్ష్మాపూర్ స్టేజ్ వద్ద రైతుల ధర్నాకు**

**మాజీ ఉపసభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి మద్దతు**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతులకు కీలక సమయంలో విద్యుత్ కోతలతో ఇబ్బందులు కల్పించడం సరికాదని మాజీ ఉపసభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. వ్యవసాయానికి రోజుకు 12 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని 765-డీజీ జాతీయ రహదారిపై లక్ష్మాపూర్ స్టేజ్ వద్ద విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులు ధర్నా నిర్వహించారు. కాట్రియాల్, లక్ష్మాపూర్, పర్వతాపూర్, దంతేపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. రైతుల నిరసనకు మాజీ ఉపసభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి పంట పొట్ట దశలో ఉన్న ప్రస్తుత తరుణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు అవసరమైన సమయంలో సాగునీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు పంటల సాగు కోసం విద్యుత్‌పై ఆధారపడుతున్నారని, ఇలాంటి కీలక సమయంలో కోతలు విధించడం వల్ల వారి కష్టం వృథా అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.రైతుల శ్రమకు తగిన ఫలితం దక్కాలంటే సకాలంలో సాగునీరు అందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రోజుకు 12 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.పంటలు చేతికందే కీలక సమయంలో విద్యుత్ కోతల కారణంగా రైతులు నష్టపోకుండా అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తొలగించి, రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రైతులు, సర్పంచులు,మాజీ సర్పంచ్లు,మాజీ ఎంపీటీసీలు, పట్టణ,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జెడ్ పి హెచ్ ఎస్ జి హెచ్ ఎం కొండవీటి ఆరోగ్యం సత్కారం



పాపనన్న పేట ( ప్రశ్న న్యూస్ ) ఎస్ టి యు టి ఎస్80 వసంతాల కార్యక్రమం లో భాగంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కొండవీటి ఆరోగ్యం భుజాత ఎస్ టి యు టి ఎస్ మెదక్ జిల్లా పాపన్నపేట మండల శాఖ పక్షాన చిరు జ్ఞాపిక ను అదించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండలం అధ్యక్షులు బి. ఎల్లం, ప్రధాన కార్యదర్శి సి. హెచ్. బాలమల్లేష్, ఆర్థిక కార్యదర్శి ఎన్. రాజు, జిల్లా నాయకులు కె. వేణుగోపాల్, శర్వన్ లు పాల్గొన్నారు.

# న్యూ ఎక్సీడ్ ఉన్నత పాఠశాలలో ఘనంగా దసరా సంబరాలు

**చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి**





అచ్చంపేట(ప్రశ్నాన్యూస్) సెలవులకు ముందు పాఠశాలల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అచ్చంపేట లోని న్యూ ఎక్సీడ్ ఉన్నత పాఠశాలలో దసరా పండగ సెలవులను పురస్కరించుకొని శుక్రవారం నాడు పలు సంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా బతుకమ్మ, దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయదశమి పండగల విశిష్టత తెలిపే విధంగా విద్యార్థులతో విభిన్న వేషధారణలతో మన సాంస్కృతి, సంప్రదాయాలు వారసత్వంగా నేటి తరానికి అందించేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. దసరా పండుగ సందర్భంగా పాఠశాలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థులచే మహిషాసురమర్ధిని, దుర్గమాత, చదువు తల్లి సరస్వతీ మాతతో పాటు ఇతర పాత్రల వేషధారణలతో చిన్నారులు చూపిన ప్రతిభ చూపరులను అలరించింది. ఈ సందర్భంగా దుర్గా వందన పాటలు, గర్బా నృత్యాలతో పాఠశాల ప్రాంగణమంతా సందడిగా మారింది.

**చెడుపై మంచి విజయం**

చెడుపై "మంచి" విజయం సాధిస్తుంది అనే సత్యం, నైతిక విలువలను తెలియజేసేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు సవివరంగా వివరిస్తు చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి (దసరా) పండగను జరుపుకుంటారని విద్యార్థులకు తెలియజేశారు.

# జెడ్పీ బాలుర పాఠశాలలో ఘనంగా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు



శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్) ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తిలోని ఆర్‌పీబీఎస్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం అంతరిక్ష విజ్ఞాన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్లు, అంతరిక్ష నౌకలు, ఉపగ్రహాల నమూనాలను విద్యార్థులకు ప్రదర్శించి, వాటి పనితీరు, రాకెట్ల ప్రయోగ విధానం, అంతరిక్ష పరిశోధనల ప్రయోజనాలను వివరించారు.ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందిస్తాయని అన్నారు. చిన్నతనం నుంచే సైన్స్‌పై ఆసక్తి పెంచుకుని, భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశాభివృద్ధికి దోహదపడాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఇస్రో ప్రతినిధులు, విద్యార్థులు, కోకో కంపెనీ వాళ్లు పాల్గొన్నారు. రాకెట్లు, ఉపగ్రహాల నమూనాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# జనసేన కార్యాలయంలో మెగా జాబ్‌మేళా 80 మందికి ఉద్యోగావకాశాలు.



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో శ్రీకాళహస్తి పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. దేవస్థానం పాలకమండలి చైర్మన్ కొట్టే సాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల పరిధిలోని పలు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాకు సుమారు 150 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకాగా, అర్హత, ప్రతిభ ఆధారంగా 80 మందిని వివిధ పరిశ్రమల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా కొట్టే సాయి మాట్లాడుతూ స్థానిక పరిశ్రమల్లో ప్రాంతీయ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జాబ్‌మేళా నిర్వహించినట్లు తెలిపారు. నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు శ్రీకాళహస్తి, సత్యవేడు ప్రాంతాల్లోని పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకుంటూ ప్రతి నెలా జనసేన పార్టీ కార్యాలయంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తామని వెల్లడించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కొట్టే సాయికుమార్ ఇన్చార్జి చంద్ర జన సేన నాయకులు పాల్గొన్నారు.

# రాజకీయ ఒత్తిళ్లకు లొంగేది లేదు డీఎస్పీ పావని



శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్) మాదకద్రవ్యాల కట్టడికి ప్రత్యేక చర్యలు శ్రీకాళహస్తి సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా బీ.పావని బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూశ్రీకాళహస్తి పవిత్ర పుణ్యక్షేత్రం ఉన్న ఈ సబ్ డివిజన్‌కు నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం చాలా కీలకం.చట్టం ముందు అందరూ సమానులే,రాజకీయ ఒత్తిళ్లకు లొంగే ప్రసక్తే లేదు.నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించినా,చట్టం తన పని తాను కఠినంగా చేసుకుపోతుంది. మాదకద్రవ్యాల (గంజాయి) కట్టడిపై హెచ్చరిక యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాలు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలపై మన ప్రభుత్వం, పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపుతుంది. గతంలో మదనపల్లెలో అమలు చేసిన అనుభవంతో,పారదర్శకంగా విధులు నిర్వర్తించానని, శ్రీకాళహస్తిలోనూ అదే విధానాన్ని కొనసాగిస్తానని తెలిపారు.డివిజన్ పరిధిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా నేరుగా తనను సంప్రదించవచ్చని,ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు ఇక్కడ కూడా డ్రగ్స్ మూలాలను ఏరిపారేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.మత్తు పదార్థాల జోలికి వెళ్లి యువత తమ విలువైన జీవితాలను పణంగా పెట్టవద్దు. విక్రయించే వారిపై, సేవించే వారిపై ఎటువంటి మొహమాటం లేకుండా కఠిన చట్టపరమైన చర్యలుంటాయి.మత్తు పదార్థాల విక్రయాలు తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు.నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మహిళల రక్షణే మహిళల భద్రతకు మరియు రక్షణకు మా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. సమాజంలో మహిళలపై వేధింపులను, అఘాయిత్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. ఎవరైనా సరే వేధింపులకు గురైతే భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయండి. మీకు అండగా మేము ఎప్పుడూ ఉంటాము. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం ప్రత్యేక దృష్టి చేస్తాం, శ్రీకాళహస్తి పట్టణంలో ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేకపోవడం వల్ల వాహనదారులు, స్థానికులు పడుతున్న ఇబ్బందులను నేను పూర్తిగా గుర్తించాను. త్వరలోనే ప్రత్యేక ట్రాఫిక్ అవుట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసి, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాలు చూపుతాం. ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, పోలీసులకు సహకరించాలని కోరుతున్నాను. ప్రజలకు శ్రీకాళహస్తిని నేరరహిత, ప్రశాంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దడమే నా ప్రధాన లక్ష్యం.ప్రజలు, మీడియా మిత్రులు సహకరిస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఎవరికైనా ఏ సమస్య ఉన్నా నేరుగా నన్ను సంప్రదించవచ్చు.

# భూ బాధితుడికి నెల రోజుల్లో న్యాయం చేయాలి

**ఆర్డీవోకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి వినతి**



శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్) గత వైకాపా ప్రభుత్వ హయాంలో భూ ఆక్రమణకు గురైన బాధిత రైతుకు న్యాయం చేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి రెవెన్యూ అధికారులను కోరారు. శ్రీకాళహస్తి మండలం బోయినపల్లికి చెందిన రైతు చిట్టత్తూరు బత్తయ్యకు సంబంధించిన భూ వివాదంపై శుక్రవారం స్థానిక ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డిని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోయినపల్లికి చెందిన రైతు బత్తయ్యకు ఉన్న ఒకటిన్నర ఎకరా భూమి గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురైందని ఆరోపించారు. తన భూమిని తిరిగి ఇప్పించాలని బాధిత రైతు రెండేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం లభించలేదని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధిత రైతు తమను సంప్రదించారని, ఆయనకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి ఆర్డీవోతో ప్రత్యేకంగా చర్చించినట్లు వెల్లడించారు. మరో నెల రోజుల్లోగా బాధిత రైతుకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతుల సంక్షేమం,వారి భూములకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు.

# ఇన్స్యూరెన్స్ కంపెనీల ఆగడాలు..
# క్లెయిమ్‌లకు తప్పని తిప్పలు

**- పాలసీలు విక్రయించడంలో చూపే శ్రద్ధ.. పరిహారం చెల్లింపులో ఏది?**

**- నిబంధనల పేరుతో కొర్రీలు.. పత్రాల కోసం పదేపదే తిప్పలు- ప్రీమియం వసూళ్లలో వేగం.. క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజల కష్టకాలంలో ఆర్థిక భరోసా కల్పించాల్సిన ఇన్సూరెన్స్ కంపెనీలు క్లెయిమ్‌ల పరిష్కారంలో మాత్రం పాలసీదారులకు చుక్కలు చూపిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలసీ తీసుకునే సమయంలో ఆకర్షణీయమైన హామీలు ఇస్తూ, ప్రీమియంలను క్రమం తప్పకుండా వసూలు చేసే సంస్థలు అవసరమైన సమయంలో క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకుంటే మాత్రం రకరకాల నిబంధనలు, పత్రాల పేరుతో జాప్యం చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వైద్య ఖర్చులు, ఆసుపత్రి బిల్లులు, ప్రమాదాలు, మరణ పరిహారం వంటి క్లెయిమ్‌ల విషయంలో బాధిత కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## - ప్రీమియం చెల్లింపులో ఒక్క రోజు ఆలస్యమైనా ఒత్తిడి

పాలసీ ప్రీమియం చెల్లించాల్సిన సమయం దగ్గరపడగానే ఫోన్ కాల్స్, సందేశాలతో గుర్తుచేసే సంస్థలు క్లెయిమ్ పరిష్కారానికి వచ్చేసరికి మాత్రం రోజుల తరబడి సమయం తీసుకుంటున్నాయనే విమర్శలు ఉన్నాయి. పాలసీ తీసుకునే సమయంలో నిబంధనలు స్పష్టంగా వివరించకపోవడం, క్లెయిమ్ సమయంలో మాత్రం చిన్నచిన్న అంశాలను సైతం ప్రస్తావిస్తూ అదనపు పత్రాలు కోరడం పాలసీదారులకు భారంగా మారుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## - వైద్య బిల్లులకూ కొర్రీలేనా.?

ఆరోగ్య బీమా తీసుకున్నవారు ఆసుపత్రిలో చేరినప్పుడు నగదు రహిత చికిత్స (క్యాష్‌లెస్) అందుతుందని ఆశిస్తారు. అయితే కొన్ని సందర్భాల్లో అనుమతుల జాప్యం, పత్రాల పరిశీలన, చికిత్సకు సంబంధించిన వివరాల కోరింపు వంటి కారణాలతో రోగులు, వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. ఇప్పటికే వైద్య ఖర్చులతో సతమతమవుతున్న కుటుంబాలకు బీమా క్లెయిమ్ ప్రక్రియ మరో భారంగా మారకూడదని ప్రజలు కోరుతున్నారు. అయితే ప్రతి క్లెయిమ్ జాప్యానికి బీమా సంస్థలే కారణమని చెప్పలేం. పాలసీ నిబంధనలు, మినహాయింపులు, వేచి ఉండాల్సిన కాలపరిమితులు, వైద్యపరమైన పరిశీలనలు వంటి అంశాలు కూడా క్లెయిమ్ నిర్ణయంపై ప్రభావం చూపుతాయి. అయినప్పటికీ, తిరస్కరణకు లేదా జాప్యానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత సంస్థలపై ఉంది.

## - క్లెయిమ్ తిరస్కరణకు కారణాలేవి.?

పాలసీలో లేని ప్రయోజనాలను కోరడం, ముందుగా ఉన్న వ్యాధులకు సంబంధించిన నిబంధనలు, తప్పుగా లేదా అసంపూర్ణంగా సమర్పించిన సమాచారం, అవసరమైన పత్రాల కొరత వంటి కారణాలతో కొన్ని క్లెయిమ్‌లు తిరస్కరణకు గురవుతుంటాయి. అయితే సరైన పత్రాలు సమర్పించినప్పటికీ, పాలసీ నిబంధనలకు అనుగుణంగా ఉన్న క్లెయిమ్‌లను స్పష్టమైన కారణాలు లేకుండా తిరస్కరించడం లేదా అనవసరంగా పెండింగ్‌లో ఉంచడం జరిగితే అది తీవ్రంగా పరిగణించాల్సిన అంశమే. క్లెయిమ్ తిరస్కరణకు గురైనప్పుడు దానికి సంబంధించిన కారణాలను లిఖితపూర్వకంగా తీసుకోవడం, పాలసీ నిబంధనలను పరిశీలించడం, సంస్థ ఫిర్యాదుల పరిష్కార విభాగాన్ని సంప్రదించడం వంటి చర్యలు పాలసీదారులకు ఉపయోగపడతాయి.

## - ప్రభుత్వ పర్యవేక్షణ ఏదీ.?

బీమా రంగాన్ని నియంత్రించే భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) నిబంధనల ప్రకారం ఫిర్యాదుల పరిష్కారం, క్లెయిమ్‌ల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యం ఉంది. అయినప్పటికీ, క్లెయిమ్‌ల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వినియోగదారులకు ఫిర్యాదు ప్రక్రియపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. బీమా సంస్థలు తమ క్లెయిమ్‌ల పరిష్కార విధానాలను సరళీకరించడంతో పాటు, తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలి. ఫిర్యాదులపై సకాలంలో స్పందించే వ్యవస్థను మరింత సమర్థంగా అమలు చేయాలి.

## - బాధితులకు న్యాయం ఎప్పుడు.?

బీమా అనేది కేవలం వ్యాపారం మాత్రమే కాదు, ప్రజలు కష్టకాలంలో ఆదుకుంటుందనే నమ్మకంతో తీసుకునే ఆర్థిక రక్షణ. అలాంటి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత బీమా సంస్థలపై ఉంది. క్లెయిమ్ పరిష్కారంలో జాప్యం, అనవసరమైన పత్రాల డిమాండ్, సరైన వివరణ లేకుండా తిరస్కరణ వంటి సమస్యలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలి. పాలసీదారుల ఫిర్యాదులను సమర్థంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి.

**పాలసీ విక్రయించేటప్పుడు ఇచ్చే హామీలు, క్లెయిమ్ చెల్లించే సమయంలోనూ అమలవ్వాలి. ప్రజల కష్టకాలంలో అండగా నిలవాల్సిన బీమా.. వారికి మరో కష్టంగా మారకూడదు. కానీ ప్రస్తుతం బీమా కంపెనీలో పాలసీదారులకు చాలా సమయాలలో నిబంధన పేరుతో మొండి చేయి ఇవ్వడం సర్వసాధారణంగా మారింది దానితో పాలసీదారులు లబోదిబోమని ముత్తుకోవడం తప్ప ఏమి చేయలేని దుస్థితిలో ఉండిపోతున్నారు. మరి ప్రభుత్వాలు ఇకపై ఇన్సూరెన్స్ కంపెనీల ఆగడాలకు చెక్ పెట్టి ప్రజలకు న్యాయం చేస్తాయా.?**

# వాటర్ కంపెనీల మోసం
# బిఐఎస్ తనిఖీలు ఎక్కడ.?

**- ఒకే చోట ఎన్నో బ్రాండ్ల లోగోలు.. అసలు దందా వెనుక ఎవరున్నారు.?**

**- నకిలీ సర్టిఫికెట్లతో తాగునీటి వ్యాపారం సాగుతోందా.?**

**- అనుమతులు ఒకరికి.. వ్యాపారం మరొకరి పేరుతోనా.?**

**- ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా.? అధికారుల తనిఖీలు ఎక్కడ.?**

**- లైసెన్సులు, సర్టిఫికెట్లు, నీటి నాణ్యతపై సమగ్ర విచారణకు డిమాండ్**







**హైదరాబాద్( ప్రశ్న న్యూస్)** లోగోలు ఎన్నో.. అసలు కంపెనీ ఏది.? సర్టిఫికెట్లు నిజమైనవేనా.? అనుమతులు ఎవరి పేరుతో ఉన్నాయి.? ప్రజల ఆరోగ్యంతో నేరుగా ముడిపడి ఉన్న తాగునీటి వ్యాపారంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే ప్రాంతంలో పలు వాటర్ కంపెనీల పేర్లు, వివిధ బ్రాండ్ల లోగోలు కనిపిస్తుండటంతో అసలు వ్యాపార నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పెబ్లీ, కెల్బీ, బిస్లీ, బినారి వంటి అనేక రకాల పేర్లతో నీటి వ్యాపారం సాగుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ బ్రాండ్లకు సంబంధించిన అనుమతులు, లైసెన్సులు, సర్టిఫికెట్ల వాస్తవికతపై అధికార యంత్రాంగం స్పష్టమైన వివరాలు ఇవ్వాలని అసలు ఈ కంపెనీలు ఉన్నాయా.? ఉంటే అధికారులు తనిఖీలు చేస్తున్నారా.? అన్నదానిపై బిఐఎస్ పూర్తిస్థాయిలో వివరాలు తెలపాలని ప్రజలు కోరుతున్నారు.

## ఒకే చోట ఎన్నో బ్రాండ్లు.. అసలు గుట్టేంటి.?

ఒకే ప్రాంతంలో వివిధ కంపెనీల పేర్లు, లోగోలు ఉపయోగిస్తూ తాగునీటి వ్యాపారం నిర్వహిస్తున్నారనే అనుమానాలు స్థానికుల్లో చర్చనీయాంశంగా మారాయి. ఒకే ప్లాంట్‌లో పలు బ్రాండ్ల పేర్లతో నీటిని నింపి విక్రయిస్తున్నారా.? అలా చేస్తుంటే ఆయా బ్రాండ్లకు అవసరమైన అనుమతులు ఉన్నాయా.? సంబంధిత కంపెనీలతో ఒప్పందాలు ఉన్నాయా.? లేక ఇతర సంస్థల పేర్లను ఉపయోగించుకుంటున్నారా.? అన్నది తేలాల్సి ఉంది.బాటిళ్లపై లేదా వాటర్ క్యాన్లపై ముద్రించిన పేరు, లోగో చూసి నీటిని కొనుగోలు చేసే వినియోగదారులకు దాని తయారీ కేంద్రం, నాణ్యత, అనుమతుల వివరాలు తెలిసే పరిస్థితి ఉందా.? అన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ క్షేత్రస్థాయిలో విచారణ చేపడితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## సర్టిఫికెట్లు నిజమైనవేనా.? నకిలీవనే అనుమానాలపై విచారణ ఏదీ.?

తాగునీటి తయారీ, శుద్ధి, ప్యాకేజింగ్, విక్రయాలకు సంబంధించి వర్తించే నిబంధనలు పాటిస్తున్నారా.? అవసరమైన లైసెన్సులు, ధ్రువపత్రాలు ఉన్నాయా.? నీటి నాణ్యతను నిర్ధారించే పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారా.? అనే అంశాలపై అధికారులు సమగ్ర పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది.కొన్ని ప్లాంట్లలో సర్టిఫికెట్ల విషయంలో అనుమానాలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే అవి నిజమైనవా, నకిలీవా అన్నది ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. సంబంధిత ధ్రువపత్రాలను జారీ చేసిన సంస్థలతో నేరుగా ధ్రువీకరించి, వాటి చెల్లుబాటు, గడువు, వర్తించే ఉత్పత్తులు, తయారీ కేంద్రాల వివరాలను అధికారులు పరిశీలించాలి.ఒక సర్టిఫికెట్ చూపిస్తే సరిపోతుందా.? అది ఏ కంపెనీకి, ఏ ప్లాంట్‌కు, ఏ ఉత్పత్తికి వర్తిస్తుందో నిర్ధారించాల్సిన బాధ్యత అధికారులపై లేదా.? అన్న ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

## అధికారులు నిద్రలో ఉన్నారా.? తనిఖీలు ఎక్కడ.?

ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాల్సిన వ్యవస్థలో అనుమానాలకు తావుండటం ఆందోళన కలిగిస్తోంది. అనేక బ్రాండ్ల పేర్లు వినిపిస్తున్నప్పటికీ, ఆయా సంస్థల అనుమతులు, తయారీ కేంద్రాల వివరాలు, నాణ్యతా ప్రమాణాలపై స్పష్టత లేకపోవడం పర్యవేక్షణ వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఆహార భద్రతా అధికారులు, అవసరాన్ని బట్టి లీగల్ మెట్రాలజీ, ఇతర అనుమతి సంస్థలు సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ప్లాంట్లలోని శుద్ధి యంత్రాలు, నీటి నమూనాలు, ప్యాకేజింగ్ విధానం, లేబుళ్లు, తయారీ తేదీలు, బ్యాచ్ వివరాలు, లైసెన్సులు, సర్టిఫికెట్లను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలకు ప్రమాదకరమైన నీటి విక్రయాలు జరుగుతున్నట్లు తేలితే వాటిని తక్షణమే అరికట్టాలని కోరుతున్నారు.

## ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా.?

తాగునీరు నేరుగా ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అత్యవసర వినియోగ వస్తువు. నీటి శుద్ధి ప్రక్రియలో లోపాలు, కలుషిత నీరు, అపరిశుభ్రమైన ప్యాకేజింగ్ వంటి సమస్యలు ఉంటే వినియోగదారులకు ఆరోగ్యపరమైన ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. అందువల్ల నీటి నాణ్యతను కేవలం ప్రచారంతో కాకుండా ప్రయోగశాల పరీక్షలతో నిర్ధారించాల్సిన అవసరం ఉంది.




బ్రాండ్ పేరు చూసి నమ్మకంతో నీటిని కొనుగోలు చేస్తున్న సామాన్య ప్రజలకు నాణ్యమైన నీరు అందుతోందా లేదా అన్నది తెలుసుకునే హక్కు ఉంది. అందుకే సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకుండా అనుమానాస్పద ప్లాంట్లను తనిఖీ చేసి, పరీక్షల ఫలితాలు, అనుమతుల స్థితిపై పారదర్శకత పాటించాలని ప్రజలు కోరుతున్నారు.

## అధికారుల విచారణతోనే అసలు నిజాలు వెలుగులోకి

అసలు ఏ కంపెనీకి అనుమతి ఉంది? ఎన్ని బ్రాండ్ల పేర్లతో నీటి వ్యాపారం జరుగుతోంది.? వాటి వెనుక ఉన్న సంస్థలు ఎవరు.? సర్టిఫికెట్లు చెల్లుబాటులో ఉన్నాయా.? నీటి నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా.? అన్న ప్రశ్నలకు సంబంధిత శాఖల సమగ్ర విచారణతోనే స్పష్టత రానుంది. అనుమానాలను నిజాలుగా ప్రచారం చేయడం కాదు.. నిజానిజాలను అధికారికంగా తేల్చాల్సిన సమయం ఇది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి తనిఖీలు చేపట్టాలి. నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా పర్యవేక్షణను పటిష్ఠం చేయాలి.

# తుడాకు రూ.200 కోట్లు..
# అభివృద్ధి పనులకు ఊతం

**తితిదే జేఈఓ శరత్‌కుమార్‌ను కలిసిన తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి**

**తిరుపతి నగరం, పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు**



తిరుపతి(ప్రశ్న న్యూస్) తిరుపతి నగరం, పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన పనుల కోసం తితిదే ద్వారా తుడాకు రూ.200 కోట్ల నిధులు విడుదల చేసినట్లు పేర్కొంటూ తుడా ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ ఆర్.గోవిందరావు తితిదే జేఈఓ శరత్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు వారు జేఈఓను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా డాలర్స్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతికి వచ్చే భక్తులతో పాటు స్థానిక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం తుడా ప్రధాన లక్ష్యమన్నారు. నగర పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు రూ.200 కోట్ల నిధులు కేటాయించడం హర్షణీయమని పేర్కొన్నారు. తితిదే బోర్డు, యాజమాన్యానికి తుడా తరఫున, తిరుపతి ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

## మౌలిక వసతుల విస్తరణకు దోహదం

తుడా వైస్ ఛైర్మన్ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ తితిదే, తుడా సమన్వయంతో నగరంలో మౌలిక వసతుల విస్తరణకు ఈ నిధులు దోహదపడతాయని అన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రజా సౌకర్యాల మెరుగుదలకు తితిదే సహకారం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుడా కార్యదర్శి డా. ఎన్.వి. శ్రీకాంత్‌బాబు, ఎస్ఈ రవీంద్రయ్య పాల్గొన్నారు.

# ఆస్తుల వివరాలిస్తేనే పదోన్నతి

**తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త నిబంధన**

**ఈ నెల 31లోగా ఆస్తులు, అప్పుల వివరాల నమోదు**




చెన్నై(ప్రశ్న న్యూస్) ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతులకు ఆస్తుల వివరాల సమర్పణను తప్పనిసరి చేస్తూ తమిళనాడు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. నిర్ణీత గడువులోగా ఆస్తుల వివరాలు సమర్పించని ఉద్యోగులను పదోన్నతి జాబితాల్లో చేర్చకూడదని స్పష్టం చేసింది.రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ తమ స్థిర, చరాస్తులు, పొదుపు, అప్పులకు సంబంధించిన వివరాలను ఈ నెల 31లోగా ప్రభుత్వ 'ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఆదేశించింది.

## ఇతరుల పేర్లపై ఉన్న ఆస్తులూ వెల్లడించాలి

ఉద్యోగులు తమ పేరుతో ఉన్న ఆస్తులతో పాటు ఇతరుల పేర్లతో కొనుగోలు చేసిన ఆస్తులకు సంబంధించిన వివరాలను కూడా వెల్లడించాలని ప్రభుత్వం సూచించింది. ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకతను పెంపొందించడం, ఉద్యోగుల ఆస్తుల వివరాలను నమోదు చేయడం ఈ చర్యల ఉద్దేశంగా పేర్కొంది.గడువులోగా వివరాలు సమర్పించని ఉద్యోగులకు పదోన్నతుల విషయంలో అవకాశం కల్పించకూడదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఉద్యోగులు తమ ఆస్తుల వివరాలను సకాలంలో నమోదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# నవరాత్రి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**- టిటిడి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి**



తిరుమల(ప్రశ్న న్యూస్ ) శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలను అధికారుల సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని టిటిడి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి సూచించారు. సెప్టెంబరులో నిర్వహించిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడంలో ఉద్యోగుల సమష్టి కృషి కీలకమని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో నవరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో విధులు కేటాయించిన ఉద్యోగులతో శుక్రవారం సాయంత్రం తిరుమల ఆస్థాన మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బ్రహ్మోత్సవాలను అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారని తెలిపారు.

## సమన్వయంతో పనిచేయాలి

జేఈఓ డాక్టర్ శరత్ మాట్లాడుతూ గత బ్రహ్మోత్సవాల విజయానికి అధికారుల సమన్వయం, సిబ్బంది టీమ్‌వర్క్ దోహదపడ్డాయని చెప్పారు. అదే విధంగా నవరాత్రి బ్రహ్మోత్సవాల్లోనూ ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు.

## భక్తుల భద్రతకు ప్రాధాన్యం

సీవీఎస్వో మురళీకృష్ణ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల భద్రత అత్యంత కీలకమని తెలిపారు. మాడ వీధులతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ భద్రతా సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు వెళ్లేందుకు వీలుగా గేట్లను తెరిచి ఉంచడంలో ఉద్యోగులు, శ్రీవారి సేవకులు సహకరించాలని సూచించారు.సమావేశంలో జేఈఓ (విద్య, వైద్యం) గోపీనాథ్‌తోపాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588